
శ్రీకాళహస్తీశ్వరుని అలంకారంలో మార్కాపురంలోని మార్కండేశ్వరుడు

శివోహం


చీమకుర్తిలోని సాక్షిరామలింగేశ్వరాలయంలో కోటి దీపోత్సవం

ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభోశంకర.. నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా వేకువజాము నుంచే పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. పరమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రికి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నగరోత్సవం, పల్లకీ సేవలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని ముక్కంటి సేవలో తరించారు. మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి శ్రీకాళహస్తీశ్వరునిగా, జగదాంబ మాత అర్ధనారీశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. చీమకుర్తిలో కోటి దీపోత్సవాన్ని కన్నులపండువలా నిర్వహించారు.

- వివరాలు లోపలి పేజీల్లో..


ఒంగోలు కేశవస్వామి పేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

లైన్‌క్లియర్

వెలిగొండ టన్నెల్ పనులు మళ్లీ మొదలు


వరద నీరు తొలగింపుతో బయటపడిన టన్నెల్-2 ముఖద్వారం

మొంథా తుఫాన్ కారణంగా వెలిగొండ ప్రాజెక్టు పనులకు ఏర్పడిన ఆటంకాలు ఒక్కొక్కటిగా తొలగిపోతున్నాయి. నిర్మాణ పనులు చేసేందుకు మార్గం సుగమమైంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఒకటికి రెండుసార్లు వెంటవెంటనే పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అటు అధికారులు, ఇటు కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కదలిక వచ్చింది. ఆటంకాల తొలగింపు ప్రక్రియ వేగంగా సాగింది. మరో రెండు రోజుల్లో కీలకమైన టన్నెల్-2లో లైనింగ్ పనుల పునఃప్రారంభానికి ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఒంగోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనుల పునఃప్రారంభానికి లైన్‌క్లియర్ అయ్యింది. టన్నెళ్లలో చేరిన వరద నీరు, మట్టి తొలగింపు పనులకు ఆటంకాలు తొలగాయి. మిగతా పనులు కూడా వేగవంతమయ్యాయి. గత నెలాఖరులో సంభవించిన మొంథా తుఫాన్ జిల్లాపై తీవ్రప్రభావం చూపిన విషయం విదితమే. కేవలం 36 గంటల్లోనే ఏకంగా 18.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లమలలో కురిసిన భారీ వర్షాలకు తీగలేరు వాగు పొంగి ప్రవహించి వెలిగొండ ఫీడర్ కాలువను ముంచెత్తింది. దీంతో అప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న కాలువ మరింత దెబ్బతినడంతోపాటు భారీగా వరద నీరు ఆ కాలువకు అనుసంధానంగా ఉన్న వెలిగొండ టన్నెళ్లలోకి చేరింది.

టన్నెళ్ల నిండా బురద, నీరు

వెలిగొండ ఒక్కొక్క టన్నెల్ పొడవు 18.80 కి.మీ కాగా వెలుపలి వైపు నుంచి దాదాపు 9 కి.మీ వరకు సగం ఎత్తులో వరదనీరు చేరడంతో టన్నెల్-2లో జరుగుతున్న పనులు ఆగిపోయాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతోపాటు మిషనరీ మొత్తం వరద నీరు, బురదలో చిక్కుకొంది. ఇంచుమించు 0.40 టీఎంసీల నీరు అలా టన్నెల్‌లోకి వెళ్లినట్లు అధికారులు అంచనా వేశారు. ఆ ప్రాంతాన్ని ఈనెల 7న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సందర్శించారు. పరిస్థితిని పరిశీలించారు. టన్నెళ్ల నుంచి నీటిని తక్షణం

మిగతా 6వ పేజీలో

- మొంథా తుఫాన్‌తో ముంచెత్తిన వరద నీరు తొలగింపు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- రెండు రోజుల్లో లైనింగ్ పనుల పునఃప్రారంభానికి అధికారుల చర్యలు
- ఫీడర్ కాలువ, తీగలేరు వాగుల్లో ఆటంకాల తొలగింపు పనులు
- మంత్రి నిమ్మల వరుస పర్యటనలతో కొలిక్కి వస్తున్న ప్రాజెక్టు వ్యవహారం

భూమి కోసం.. కాళ్లరిగేలా..!

- తొమ్మిది మంది తహసీల్దార్లు.. 100 అర్జీలు..
- ఆన్‌లైన్ కోసం ఐదేళ్లుగా తిరుగుతున్న వృద్ధుడు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పది ఎకరాల తన భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఐదేళ్లుగా ముగ్గురు ఆర్డీవోలు, తొమ్మిది మంది తహసీల్దార్లకు 100 అర్జీలు ఇచ్చినా పట్టించుకోకుండా తిప్పుకుంటున్నారని వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం జరిగిన మీకోసంలో జేసీని మర్రిపూడి మండలం అయ్యప్పరాజుపాలెం గ్రామానికి చెందిన వడ్డెమాని శింగయ్య వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పూర్వీకుల నుంచి పది ఎకరాల భూమి తనకు వచ్చిందన్నారు. దాని ఆన్‌లైన్ కోసం ఐదేళ్లుగా తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా సమస్య నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఒకవైపు అధికారుల చుట్టూ తిరిగేందుకు డబ్బులు లేక, మరోవైపు వయసు మీదపడి ఆరోగ్యం సహకరించక అల్లాడిపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వలన తన భూమి ఆన్‌లైన్ నమోదు చేయడం లేదని, ఇక తనకు తిరిగే ఓపిక కూడా లేదని శింగయ్య తెలిపారు. ఇప్పటికైనా తన గోడు ఆలకించి, న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు.


వడ్డెమాను సింగయ్య

మళ్లీ అన్నదాత సుఖీభవ

- రేపు రెండో విడత నిధులు విడుదల
- ఆర్‌ఎస్‌కే యూనిట్‌గా కార్యక్రమాలు ఏర్పాటు



ఒంగోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులు బుధవారం విడుదల కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఒక్కో రైతుకు రూ.6వేలను మూడు విడతలుగా, రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.14వేలను మూడు విడతలుగా ఇస్తున్నాయి. కేంద్రం ఏడేళ్లుగా ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభించింది. కేంద్రం నిధులు విడుదల చేసే రోజునే రాష్ట్రప్రభుత్వం కూడా ఇవ్వాలని నిర్ణయించింది. అలా రెండు పథకాలు కలిపి మూడు విడతలలో ఒక్కో రైతుకు రూ.20వేల వంతున లబ్ధి చేకూరుతోంది. అందులో తొలి విడత ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన విడుదల చేశారు. ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత-సుఖీభవ నిధులు విడుదల కార్యక్రమాన్ని జిల్లాలోని దర్శి నియోజకర్గం తూర్పువీరాయపాలెం నుంచి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. రెండో విడత నిధులను బుధవారం విడుదల చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం నుంచి కార్యక్రమం నిర్వహించనున్నారు. అదేసమయంలో రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే) స్థాయిలో లబ్ధిదారులతో సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ పరిధిలోని లబ్ధిదారులను ఆర్‌ఎస్‌కే వద్దకు చేర్చి ముఖ్యమంత్రి పాల్గొనే సభ ప్రత్యక్ష ప్రసారాన్ని

మిగతా 6వ పేజీలో



సీఐఐ సదస్సు సూపర్ హిట్

- ఎంవోయూలతో రాష్ట్రానికి రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు..16 లక్షల ఉద్యోగాలు
- జిల్లాకు రూ. 3,704 కోట్ల పెట్టుబడులు, 5 వేలకుపైగా కొలువులు వచ్చే అవకాశం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి

తూర్పునాయుడుపాలెం (కొండపి), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ సదస్సు విజయవంతమైందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఉత్తమ ఫలితాలనిచ్చిందని చెప్పారు. రాష్ట్రంలో రూ.13.25లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ పారిశ్రామిక సంస్థలు ముందుకువచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో 614 ఎంవోయూలు చేసుకున్నాయని వెల్లడించారు. దీని ద్వారా 16లక్షల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని చెప్పారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ సదస్సు వల్ల జిల్లాకు 3,704 కోట్ల పెట్టుబడులు, 5వేలకుపైగా ఉద్యోగాలు వస్తాయని స్వామి వివరించారు. వెనుకబడిన మన జిల్లాకు ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడులు రావడం ఇదేమొదటిసారని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటికొక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్నదే చంద్రబాబు సంకల్పమన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం 7

కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాల్

కట్టలకు ఆశపడి కటకటాల్లోకి..

7

- రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షల చోరీ నిందితుల అరెస్టు
- పోలీసులా వచ్చి.. దొంగలా దోచుకుపోయి..
- జిల్లాకు చెందిన సోదరుల పనే..
- పనిచేసిన సంస్థలోని డబ్బుపైనే అన్న కన్ను
- తమ్ముడి సాయంతో చాకచక్యంగా చోరీ


వివరాలను వెల్లడిస్తున్న జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు




ఉప్పుగుండూరులోని వేణుగోపాల స్వామి ఆలయం

దేవదాయశాఖలో మీనిశెట్టి మేత..!

- కరోనా కాలంలో పండుగలు నిర్వహించినట్లు నగదు స్వాహా
- భూముల కౌలు, ఇతర రాబడి లెక్కల్లో భారీగా తేడాలు
- ఉప్పుగుండూరు గ్రూపు దేవాలయాల పూర్వపు ఈవో ఇష్టారాజ్యం
- మట్టిగుంట శివాలయంలోనూ అదేతీరు
- ఆయనకు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ అండదండలు
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

7

పూరిమెట్ల సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు మండలం పూరిమెట్ల గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసిన సర్పంచ్ టంగుటూరి రామాంజి చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దుచేస్తూ డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి తెలియకుండా సర్పంచ్ ఒక విడత రూ.48,346, మరో విడత రూ.88,950 డ్రా చేశారు. దీనిపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై విచారణ చేపట్టగా నిధులను అక్రమంగా డ్రా చేసుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో సర్పంచ్ రామాంజికి అధికారులు సంజాయిషీ నోటీసు ఇచ్చారు. వారంరోజుల్లోపు వివరణ ఇవ్వాలని అందులో సూచించారు. అయితే సర్పంచ్ వివరణ సమంజసంగా లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో రూల్ 42(1) ప్రకారం అతని చెక్ పవర్‌ను మూడు నెలలపాటు తాత్కాలికంగా రద్దుచేస్తూ డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు.

గుంత బొమ్మాళీ..

కొమరోలు మండలం పాముూరుపల్లి గ్రామ శివాలయం ఎదురు కడప - అమరావతి రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. వాటి దగ్గరకు వచ్చే వరకూ వాహనదారులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో అటువైపు వెళ్లే వారిని అప్రమత్తం చేసేందుకు స్థానికులు దిష్టిబొమ్మ ఆకారంలో ఎర్రటి వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇటీవల రెండు పర్యాయాలు మరమ్మతులు చేసినా గుంతలు పడుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతున్నదని వాపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కొమరోలు



ఒంగోలు కాశీవిశ్వేశ్వరాలయంలో..







కొత్తపట్నం బస్టాండులోని శివాలయంలో..

హరోం హరహర!

ఘనంగా కార్తీకమాస పూజలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం మహిళలు పలు శివాలయాలకు వచ్చి కార్తీక దీపారాధనలు చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి స్వామివారికి నివేదనలు సమర్పించారు. ఇక కార్తీక సోమవారం సందర్భంగా ఆయా దేవాలయాలలో పరమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, లాయర్‌పేట సాయిబాబా మందిరం మరకత రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరం కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, అయ్యప్ప దేవస్థానం మొదలైన దేవస్థానాలకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి దీపారాధనలు చేసి, స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.



కొత్తపట్నం బస్టాండులోని శివాలయంలో..

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీకి
కేజీబీవీ విద్యార్థినులు

కొమరోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుపాలెం కస్తూర్బా గాంధీ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటేషన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మందా రోజ్ సులోచన తెలిపారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

ఈనెల 16న జిల్లా స్థాయిలో నిర్వహించిన ఒకేషనల్ స్కిల్ కాంపిటేషన్‌లో ద్వితీయ స్థానంలో కేజీబీవీ విద్యార్థినులు జీస్సెప్రియ, శరణ్య, అలేఖ్య, పరమేశ్వరి నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 21న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను పోటీలకు తీర్చిదిద్దిన ఒకేషనల్ ట్రైనర్ స్వప్నను సులోచన అభినందించారు.

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

ఆరోగ్య మంత్రిని కోరిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా చేయాలని, కంభం ప్రభుత్వ వైద్యశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేతోపాటు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఉన్నారు.

లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

తొలగించి లైనింగ్ పనులు పునరుద్ధరణ, తీగలేరులో ఆక్రమణలు తొలగించి నీరు ప్రవాహం సాగేలా చర్యలు, ఫీడర్ కాలువలో మేటవేసిన మట్టి తొలగింపును యుద్ధప్రాతిపదికన చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అదేరోజు సాయంత్రం నుంచి ఆ పనులను అధికారులు చేపట్టారు. సుమారు 1,540 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న పలు మోటార్లను పెట్టి నీటి తొలగింపును అధికారులు చేపట్టారు. అలాగే తీగలేరు వాగు, ఫీడర్ కాలువల్లో కూడా పనులు ప్రారంభించారు.

వేగవంతమైన పనులు

మరోసారి ఈనెల 12వతేదీన మంత్రి నిమ్మల ఆ పనులను పరిశీలించారు. తాను ఊహించిన విధంగా పనులు సాగడం లేదని గుర్తించిన ఆయన మరికొన్ని సూచనలు చేస్తూ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులకు హెచ్చరికలతో కూడిన ఆదేశాలు ఇచ్చారు. దీంతో మరింత వేగవంతంగా సదరు పనులను అధికారులు చేసి ఎట్టకేలకు ఆదివారం రాత్రికి టన్నెల్‌లోని నీటిని బయటకు పంపి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయగలిగారు. మొత్తం అడుగుభాగంలో పేరుకుపోయిన బురద నీరు తొలగింపు, మిషనరీ శుభ్రం, పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా వంటివి చేపట్టి రెండు రోజుల్లో తిరిగి టన్నెల్-2లో లైనింగ్ పనులు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఫీడర్ కాలువలో మేట వేసిన మట్టి దిబ్బల తొలగింపుతోపాటు ప్రధాన ముంపునకు కారణమైన తీగలేరు వాగుపైనా దృష్టి సారించారు. వాగు ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి ఫీడర్ కాలువో మట్టి తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు కొనసాగిస్తున్నారు.

మళ్లీ అన్నదాత సుఖీభవ

(5వ పేజీ తరువాయి)

ప్రతి ఆర్‌ఎస్‌కేలో స్మార్ట్‌టీవీ ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే నియోజకవర్గానికి ఒకచోట స్థానిక ఎమ్మెల్యే, ఇతర కీలక నేతలు పాల్గొనేలా కార్యక్రమాన్ని రూపొందించాలని.. జిల్లాలోని మంత్రులు, కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు కూడా ఒకచోట హాజరయ్యేలా కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలాఉండగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపిక నిబంధనలలో తేడాల వల్ల ఆ పథకాల లబ్ధిదారుల సంఖ్య కొంత వ్యత్యాసం ఉంది. జిల్లాలో పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు 2,31,380 మందిగా ఇప్పటికే మండలాల వారీగా ప్రకటించారు. వారికి ఆ పథకం కింద ఈ విడత ఒక్కొక్కరికి రూ.2వేల వంతున రూ.46.28 కోట్ల మేర జమ కానున్నాయి. రాష్ట్రప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ఈ విడత ఒక్కొక్కరికి రూ.5వేలు ఇవ్వనుండగా లబ్ధిదారుల వివరాలు మంగళవారం జిల్లా అధికారులకు అందనున్నట్లు సమాచారం.

ఘనంగా హనుమాన్ సాయి మందిర వార్షికోత్సవం

బల్లికురవ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడులో ఉన్న హనుమాన్‌సాయి మందిర 19వ వార్షికోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయిమందిరంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక హారతులు, అభిషేకాలను ఏర్పాటు చేశారు. అర్చక స్వామి ఇంకొల్లు మధు, సుధీర్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కబొక్కల పాడు గ్రామంలో పాటు బల్లికురవ, కొత్త పాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, నాగరాజుపల్లి, మల్లాయపాలెం గ్రామాల నుంచి భక్తులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని సాయి బాబాను, అంజనేయస్వామిని దర్శించుకొన్నారు. కార్తీకమాసం కావడంతో మహిళ భక్తులు దేవాలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు సమష్టి కృషితో దాతల సహకారంతో సుమారు రూ. 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు

నక్కబొక్కలపాడు హనుమాన్‌సాయి మందిరంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిపై విశ్వాసంతో పలుమార్లు ఈ దేవాలయంలో సాయి బాబాను దర్శించుకున్నారు. ఈసందర్భంగా అయనకు దేవాలయ కమిటీ సాదర స్వాగతం పలికింది. ప్రతి ఒక్కరు దైవ మార్గంలో ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంత రావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, నేతలు మలినేని గోవిందరావు, శంకర్, మాలపాటి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్

గ్రంథాలయంతో ఊరికి విజ్ఞాన వెలుగు

అద్దంకిటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఊరికి వెలుగునిచ్చేదీ, చరిత్ర తెలియజేసేదీ గ్రంథాలయం అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు సోమవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మరో గ్రంథాలయ ఉద్యమం అద్దంకి శాఖ సౌజన్యంతో సృజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గాదేపల్లి దతివాకర్ దత్తు నిర్వహణలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ జ్ఞానదీపం వెలిగించే అమ్మె గ్రంథాలయం, మన దేవాలయం అన్నారు. పుస్తకపఠన అభిరుచి లక్ష్య సాధనకు ఏకైక ఆయుధమని నారాయణం బాల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ సందర్భంగా జనసాహితీ ప్రచురించిన 'కార్యసురుడు- కార్యదక్షుడు', మంచికంటి వెంకటేశ్వరరెడ్డి రచించిన 'సమాజానికి బహిరంగలేఖ' పుస్తకాలను కార్యక్రమానికి హాజరైన వారికి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మన్నం త్రిమూర్తులు గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ వసుంధరదేవి, అన్నమనేని వెంకట్రావు, చుండూరు సుగుణరావు, వారణాసి రఘురామశర్మ, పట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శ్రీమన్నారాయణ, బాబురావు, భువనేశ్వరి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితీ అభిమానులు

చీరాల : చీరాలశాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కవిసమ్మేళనం నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవులు వివిధ అంశాలపై కవిత లను వినిపించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, బీరం సుందరరావు, ఎల్ వెంకట్రావు, హేమ సుందరరావు, ఖాసీం, రూపాదేవీ, ద్రాక్షాయణి, కృష్ణచైతన్య, సుబ్బారావు, ఏకాంబరేశ్వరబాబు, పాల్గొన్నారు.



చీరాలలో కవులను సత్కరిస్తున్న ప్రతినిధులు

చినగంజాం : చినగంజాం శాఖ గ్రంథాల యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహా చార్యులు అధ్యక్షతన జరిగిన కవి సమేళ్నం లో ఎంఈవో బి.అజయ్‌బాబు మాట్లాడుతూ ఏ భాషలోని సాహిత్యమైన సమాజాన్ని ప్రతిబింబిస్తోం దని అన్నారు. సమాజ పురోగతికి ఉపయోగపడేదే నిజమైన సాహిత్యమని అన్నారు. రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, కవి, వీరేశ్వరశాస్త్రీ, అడవీదిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, యువకవి చుండూరి వెంకట్‌లు తెలుగు గొప్పతనాన్ని తెలిపే సాహిత్యం గురించి వివరించారు. అనంతరం గ్రంథపాలకులు, పాఠకులు ఎంఈవో, కవులను ఘనంగా సన్మానించారు. వెంకట్ పలు సాహిత్య పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు, ఆంధ్రబ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు, బీడీసీఎల్ నిర్వాహకులు, పాఠకులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన

అద్దంకిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంరక్షణ చట్టం గురించి కుటుంబ సభ్యులు అందరు అవగాహన కలిగి వారిని గౌరవంగా చూసుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం బస్టాండ్ ఆవరణంలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా రఫీ మాట్లా డుతూ సమాజంలో వృద్ధుల సంరక్షణ, వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యుల మీద ఉన్నదన్నారు. వారి హక్కులకు భంగం కలిగినప్పుడు వారు ఈ చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అవకాశం ఉందన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రఫీ

దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● ఎంపీడీవో రాజేష్‌బాబు

వేటపాలెం(చీరాల), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో రాజేష్ బాబు తెలిపారు. సోమవారం కార్యాలయంలో 'నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి' రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు విచ్చేసే దివ్యాంగులకు ఏర్పాటు చేయాల్సిన అంశాలపై చర్చించారు. కార్యాలయాల వద్ద ర్యాంపులు. తాగునీరు ఇతర వసతుల గురించి మాట్లాడారు. అలాగే మండలంలో అన్ని కార్యాలయాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సెక్రటరీ చక్రవర్తి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు వేరే పెళ్లిల్లు చేసుకున్నారని...

● మనస్థాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్సపొందుతూ మృతి

అద్దంకి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనస్పర్థలతో వేరే వివాహాలు చేసుకోవడంతో మనస్థాపంతో ఎలుకల మందు తిన్న యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని గాజులపాలేనికి చెందిన తిప్పాబత్తిన శేషాద్రి (21) నర్సరావుపేటలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఆయన తల్లిదండ్రులు విడిపోయి వేరే వివాహాలు చేసుకున్నారు. దీంతో శేషాద్రి తాత సుబ్బారావు వద్ద ఉంటున్నాడు. మనస్థాపంతో ఈ నెల 11న ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి ఒంగోలు వైద్యశాలలో, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తాత సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న పెద్ద వీరయ్య

జీవీ ట్రస్టు ధర్మకర్తగా పెద్ద వీరయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రంలోని గోరంట్ల వెంకన్న ట్రస్టు వంశపారంపర్య ధర్మకర్తగా గోరంట్ల పెద్ద వీరయ్య నియమితులయ్యారు. ఆమేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మసముద్రంతోపాటు ఒంగోలులో కూడా ఆస్తులున్న ఈ ట్రస్టుకు గతంలో వీరయ్య తాత, తండ్రి ధర్మకర్తలుగా వ్యవహరించారు. మధ్యలో అధికారుల పాలనలో ఉంచారు. తాజాగా దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు పెద్ద వీరయ్య నియమితులయ్యారు. ఓరియంటల్ కాలేజీ ఈ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, ఆయుర్వేద వైద్యశాల కొంతకాలంగా మూతపడి ఉంది. కాలేజీ సక్రమ నిర్వహణకు తొలుత చర్యలు తీసుకొని పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా పెద్ద వీరయ్య తెలిపారు. ఆతర్వాత వైద్యశాలపై దృష్టి సారిస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తోపాటు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు సౌజన్య ఎంపిక

మార్కాపురం వన్ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న టి.సౌజన్య జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి తెలిపారు. మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజన్‌స్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో సౌజన్య ప్రతిభకనబర్చి జిల్లాస్థాయికి ఎంపికైందన్నారు. శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు జాహ్నవిప్రియ, రోహిణిని అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన సౌజన్యతో టీచర్లు

మా భూమి మాకు ఇప్పించండి

పీజీఆర్‌ఎస్‌లో బల్లికురవ రైతుల విజ్ఞప్తి



భూమి ఆక్రమించారంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బల్లికురవ గ్రామానికి చెందిన రాఘవులు, వీరరాఘవులు, పూర్ణయ్య, సుబ్బారావులకు సంబంధించిన 69సెంట్ల భూమిని ఆక్రమించిన వారి పేరిట ఆన్‌లైన్ చేసి ఇబ్బంది పెడుతున్నారంటూ సోమవారం పీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ సింగారావు తమ భూమిని జొన్నలగడ్డ మేరమ్మ పేరిట 1బీలో నమోదు చేశారన్నారు. తమ గ్రామానికి చెందిన నాగబోయిన సింగారావు, శ్రీనివాసరావుల మద్దతుతో ఈవిధంగా చేసి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదన్నారు. తమ పూర్వీకులు నుంచి తమకు వచ్చిన భూమిని ఇప్పించి రక్షణ కల్పించాలని దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు కోటి దీపోత్సవం
సహస్ర జ్యోతిర్లింగార్చన


త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం

త్రిపురాంతకం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీ త్రిపురాంబసమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు కోటి దీపోత్సవం, సహస్ర జ్యోతిర్లింగార్చన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని జరిగే ఈ కార్యక్రమం శివరామకృష్ణశర్మ పర్యవేక్షణలో వాలిచర్ల కేశవరావు శిష్యబృందం, చండీ వేదాశ్రమం, కోదండరామస్వామి భక్తబృందం, మార్కండేయస్వామి భక్తబృందం, త్రిపురాంతకేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ భక్తబృందం సహాయ సహకారాలతో జరుగుతుందని చెప్పారు.

రగ్బీకి ప్రభుత్వ కాలేజీ విద్యార్థిని ఎంపిక



కంభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అండర్-19 క్రీడల విభాగంలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని గోసుల సాక్షి రగ్బీ క్రీడలో తన ప్రతిభను చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కర్నూలు నగరం ఆదర్శ విద్యామందిర్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో సాక్షి ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయిలో పాల్గొనే జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబర్‌లో ముంబయిలో జరిగే రబ్బీ పోటీలో సాక్షి ఆడనుందని తెలిపారు.

పంటలకు మద్దతు ధరలపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల ప్రకటనపై రూపొందించిన వాల్‌పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో జేసీ గోపాలకృష్ణ ఈపోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

జిల్లా కో ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్
అధ్యక్షుడిగా వేణుగోపాల్


ఏపీ కోపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు(విద్య), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కోపరేటివ్ సర్వీస్ అసోషియేషన్ అధ్యక్షుడిగా దాసరి వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు కోపరేటివ్‌సర్వీస్ అసోషియేషన్ హాల్లో సోమవారం ఏపీ కోపరేటివ్ సర్వీస్ అసోషియోషన్ జిల్లా ఎన్నికలు జరిగాయి. అ సోషియేషన్ అసోషియోట్ అధ్యక్షుడుగా టి.మారుతిబాబు, ఉపాధ్యక్షుడుగా కట్టా అశోక్, కిర్యదర్శిగా డి.థామస్, జయింట్ సెక్రటరీలుగా కె.అనూరాధ, కె.మురళి, ట్రెజరర్‌గా ఎం.ఉదయకిరణ్ ఎన్నికయ్యారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ, ఎమ్మెల్యే

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కోరారు. మార్కెట్ యార్డులో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఎమ్మెల్యే కందుల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో కలిసి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ ప్రాంతంలో పత్తి రైతులు తీవ్రంగా నష్టం జరిగిందని, మిగిలిన కొద్దిపాటి నాసిరకంగా ఉన్నా కొనుగోలు చేసి వారికి అండగా ఉండడం కోసం ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శివరామిరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజీ నాయక్, తహసీల్దార్ చిరంజీవి, మార్క్‌ఫెడ్ ఎండీ, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, ఏవో బుజ్జిబాయి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు శక్తివంచనలేకుండా పని చేయాలి

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పదవులను అలంకారప్రాయంగా కాకుండా పార్టీని పటిష్ట పరిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కాలనీలోని ఆయన స్వగృహం వద్ద సోమవారం నియోజకవర్గస్థాయిలో టీడీపీ పట్టణ, మండల కమిటీలు, అనుబంధ సంఘాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్ల పల్లి సత్యనారాయణ, కనిగిరి బాలవెంకటరమణ పాల్గొన్నారు.

దేవదాయశాఖలో మీనిశెట్టి మేత!

- కరోనా కాలంలో పండుగల నిర్వహణ పేరుతో నగదు స్వాహా
- లక్షల్లో కైంకర్యం.. ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ అండదండలు
- మట్టిగుంట శివాలయంలోనూ అదేతీరు
- దోచుకొన్న సొమ్ములో రూ.5 లక్షలు చెల్లించేలా చెక్కు అందించిన ఈవో
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు


మట్టిగుంటలో విచారణకు హాజరైన ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు (ఫైల్)

నాగులుప్పలపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేవుడి సొమ్మును కాపాడాల్సిన అధికారి కంచే చేను మేసిందన్న సామెతగా వ్యవహరించి పెద్దఎత్తున స్వాహా చేశాడు ఉప్పుగుండూరు గ్రూపు దేవాలయాల దేవదాయ శాఖ పూర్వపు ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు. ఉప్పుగుండూరు గ్రూపు దేవాలయాల పరిధిలోని ఉప్పుగుండూరు, మట్టిగుంట గ్రామాల్లో దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేసిన గత పదేళ్ల కాలంలో ఆ శాఖ పరిధిలోని భూముల కౌలు, ఇతర రాబడి నగదు సక్రమంగా ఖర్చు చేయాల్సి ఉండగా తన ఇష్టం వచ్చినట్లుగా రికార్డుల్లో తప్పుడు లెక్కలు నమోదు చేసుకొని లక్షల్లో మింగేశాడు. కరోనా కాలంలో దేశ వ్యాప్తంగా దేవాలయాలు మూసివేయగా ఉప్పుగుండూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో మాత్రం పండుగలు, ఇతర స్వామి వారి కార్యక్రమాలు సైతం నిర్వహించినట్లు అందుకు ఖర్చులను పెద్ద మొత్తంలో నమోదుచేసుకొని స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. అందుకు ఆశాఖ ఇన్‌స్పెక్టర్ సహకారం కూడా అందించడం కొసమెరుపు. అవినీతి ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు వ్యవహారంపై గ్రామస్థులు నిలదీయడంతో అవినీతి భాగోతం బయటపడింది. మట్టిగుంట గ్రామంలోని శివాలయంలోనూ అడ్డగోలుగా దోచుకొన్న దేవుడి సొమ్మును తిరిగి చెల్లించాలని గ్రామస్థులు పట్టుబట్టడంతో కాల్లావేళ్లాపడి రూ.5 లక్షలు చెల్లిస్తానని ఒప్పందం చేసుకొని వచ్చే ఎడాది జనవరిలో జమ చేసుకొనేలా రూ.4.90 లక్షలకు చెక్కును కూడా గ్రామస్థులకు అందించినట్లు సమాచారం.

ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీవేణుగోపాల ఆళ్వారాదులస్వామి వారి దేవస్థానానికి పూర్వకాలంలో దాతలు 53.84 ఎకరాలను దానంగా ఇచ్చారు. ఆ భూములకు ప్రతి ఏడాదీ కౌలు వేలంపాట నిర్వహించగా వచ్చిన నగదుతో స్వామి వారి కైంకర్యాలు, ఉత్సవాలు, పూజారుల జీతాలు చెల్లించుకొంటూ ఆలయ జమా ఖర్చులను వోచర్లు రాసి నగదు లావాదేవీల వివరాలు పుస్తకాలలో నమోదు చేస్తుంటారు. గత పదేళ్ల క్రితం నుంచి ఇక్కడ దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారిగా పనిచేసిన మీనిశెట్టి శ్రీనివాసరావు దేవస్థాన నగదు లావాదేవీలలో చేతివాటం ప్రదర్శించి స్వామి సొమ్మును మింగేశాడు. ఏటా ఆలయ భూముల కౌలు ద్వారా సుమారు రూ.8 నుంచి రూ.10 లక్షలు వస్తుండగా అదనంగా దాతల దానధర్మాల ద్వారా కొంత నగదు జమ అవుతోంది. ఆదాయంలో ఎక్కువ మొత్తంగా స్వామివారి సేవల పేరుతో రికార్డుల్లో నమోదుచేసి పెద్దఎత్తున సొమ్మును దిగమింగాడన్న విమర్శలున్నాయి. 2019- 21 మధ్య కరోనా సమయంలో ఎలాంటి పండుగలు, ఉత్సవాలు జరగకపోగా ఎంతో గొప్పగా నిర్వహించినట్లుగా లక్షల్లో ఖర్చులను చూపుతూ రికార్డుల్లో నమోదు చేసుకొని ఆశాఖ ఇన్‌స్పెక్టర్ అండదండలతో దిగమింగాడు. ఈవో మీనిశెట్టి నమోదు చేసిన జమా ఖర్చుల పుస్తకంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ సంతకాలు చేసి ఆమోదించడం వెనుక ఆయన పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మట్టిగుంట శివాలయంలో పనిచేసిన సమయంలోనూ అదే తీరు

ఉప్పుగుండూరు గ్రూపు దేవాలయాల పరిధిలోనున్న మట్టిగుంట గ్రామంలోని శివాలయానికి దాతలు పూర్వకాలం 41.5 ఎకరాలు అందించారు. ప్రతిఏటా ఆ భూములకు కౌలు ద్వారా రూ.10 నుంచి రూ.13 లక్షల వరకు వస్తుంది. గ్రామీణ ప్రాంతం, మైనరు పంచాయతీ కావడంతో సగటున ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చులు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవల కాలం వరకు అక్కడ ఈవోగా పనిచేసిన మీనిశెట్టి శ్రీనివాసరావు తన వ్యవహారశైలిని ఏమాత్రం మార్చుకోలేదు. అక్కడ కూడా ఇదే తీరుగా తప్పుడు లెక్కలు సృష్టించి సుమారు రూ.15 లక్షలకుపైగా స్వామివారి సొమ్మును స్వాహా చేశాడని ఆలయ కమిటీ ఆరోపిస్తోంది. గ్రామస్థులు శివాలయానికి సంబంధించిన ఆదాయ, వ్యయఖర్చులు చూపాలని ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావును గత కొద్దిరోజుల నుంచి కోరగా పలుమార్లు సాకులు చెబుతూ తప్పించుకొని తిరుగుతున్నాడు. దాంతో ప్రస్తుత ఈవోను రికార్డులు చూపించాలని గ్రామస్థులు కోరగా రికార్డులు తనవద్ద లేవని గతంలో పనిచేసిన మీనిశెట్టి శ్రీనివాసరావు వద్దనే ఉన్నాయని తనకు అప్పగించలేదని సమాధానమిచ్చారు. అనుమానం మరింతగా బలపడి గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు శివాలయంలో సమావేశం ఏర్పాటుచేసి దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంతలోనే పూర్వపు ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు మట్టిగుంట గ్రామానికి చేరుకొని గ్రామస్థులకు నచ్చచెప్పుకొని తాను దేవుడి సొమ్మును స్వాహా చేసినట్లు ఒప్పుకొని రూ.5 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా సమాచారం. వచ్చే ఎడాది జనవరిలో తన ఖాతా నుంచి జమ చేసుకొనేలా రూ.4.90 లక్షలకు చెక్కును కూడా గ్రామస్థులకు అందించినట్లు తెలిసింది. ఇప్పటికే ఉప్పుగుండూరు వేణుగోపాలస్వామి దేవస్థానం సొమ్మును స్వాహా చేసిన పూర్వపు ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు అవినీతి భాగోతంపై విచారణ చేపట్టాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాగులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి స్పందనలో వినతిపత్రం అందించారు. మట్టిగుంట శివాలయంలోనూ మీనిశెట్టి అక్రమాలపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకొని దేవుడి సొమ్మును కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- జేసీ గోపాలకృష్ణ ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. రీఓపెన్ కాకుండా అర్జీలను సకాలంలో, గడువులోపు నాణ్యతతో పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలు రకాల సమస్యలను జేసీకి విన్నవించారు. ఆయా సమస్యలపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఆయాశాఖలకు వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్లు కుమార్, పార్థసారథి, జాన్సన, విజయజ్యోతితో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

జిల్లాలో గర్భిణులకు అన్ని సేవలూ అందించాలి

ప్రతి గర్భిణీకి సకాలంలో అన్ని సేవలు అందించి ప్రిమెచ్యూరిటీ మరణాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో సోమవారం ప్రపంచ ప్రిమెచ్యూరిటీ దినోత్సవ పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టిన శిశువులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పెన్షన్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సవరణచట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా శాఖ అధ్యక్షుడు శేషయ్య అధ్యక్షత వహించారు. ధర్నాలో రాంబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9వేలతో పాటు డీఏతో కలిపి చెల్లించాలన్నారు. ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు హయ్యర్ పెన్షన్ అందరికీ వర్తింపజేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. డీఏ బకాయిలను, పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లను రెండు విభాగాలుగా విభజించడం తగదన్నారు. 30 ఏళ్ళ పాటు సర్వీసు చేసి పెన్షన్ లేకుండా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెన్షనర్లందరినీ ఏకతాటిపైకి తెచ్చి సంఘాన్ని బలోపేతం చేసినప్పుడే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జీ.నాగేశ్వరరావు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ప్రస్తుత పరిస్థితి మరింతదారుణంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే ఈ సంస్థ మనుగడ కష్టతరంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు పీకే రాజేశ్వరరావు, రత్నం, వెలిది పార్థసారధి, యటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

కట్టలకు ఆశపడి.. కటకటాల్లోకి

- రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షల చోరీ నిందితుల అరెస్టు
- పోలీసులా వచ్చి.. దోచుకుపోయిన వైనం
- ప్రకాశం జిల్లాకు చెందిన అన్నదమ్ముల పనే..
- పనిచేసిన సంస్థలోని డబ్బుపైనే అన్న కన్ను
- తమ్ముడి సాయంతో చాకచక్యంగా చోరీ

రూ.లక్షల్లో జరుగుతున్న లావాదేవీలు ఆ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగిలో దురాశ కలిగించాయి. కళ్ల ఎదురుగా నోట్ల కట్టలను చూసేసరికి కళ్లు తిప్పుకోలేకపోయాడు. ఎలాగైనా విలాసవంతమైన జీవితం గడపాలనుకున్నాడు. తమ్ముడితో కలిసి చోరీకి ప్రణాళిక వేశాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు.


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రత్నరాజు

విజయవాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో రూ.87 లక్షలు ఉన్న బ్యాగ్‌ను కాజేసిన నిందితులను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు నగరంలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన బూదల లలిత్‌బాబు.. విజయనగరం జిల్లా తెర్లాం గ్రామంలో ఉన్న ఓ పౌల్ట్రీలో హెచ్ఆర్ గుమస్తాగా పనిచేస్తున్నాడు. పౌల్ట్రీ ప్రధాన కార్యాలయం గుంటూరులో ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పౌల్ట్రీల్లోని నగదును ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. ఈ నగదును తీసుకెళ్లడానికి ప్రధాన కార్యాలయం నుంచి ఒక మేనేజర్‌ను ఆయా పౌల్ట్రీలకు పంపుతారు.

రెండుసార్లు విఫలయత్నం

తెర్లాం పౌల్ట్రీలో ఉన్న రూ.87 లక్షలను తీసుకెళ్లడానికి గుంటూరులోని ప్రధాన కార్యాలయ మేనేజర్ నాగరాజు కొద్దిరోజుల క్రితం అక్కడికి వెళ్లాడు. దీన్ని గమనించిన హెచ్ఆర్ గుమస్తా లలిత్‌బాబుకు దురాశ కలిగింది. డబ్బును పౌల్ట్రీలో కాజేస్తే దొరికిపోతానని భావించిన అతడు దాన్ని తరలించే మార్గంలో చోరీ చేస్తే దొంగలపైకి ఆ నేరం వెళ్తుందనుకున్నాడు. ఈ ప్రణాళికలో తన సోదరుడు అశోక్‌కుమార్‌ను భాగస్వామిని చేశాడు. నాగరాజు నగదును ఎక్కువగా బస్సులో తీసుకెళ్తుంటాడు. దీన్ని గమనించిన లలిత్‌బాబు రెండుసార్లు బ్యాగ్‌ను మాయం చేయడానికి ప్రయత్నించినా కుదరలేదు. గతనెల 31వ తేదీన నాగరాజు రూ.87 లక్షల బ్యాగ్‌తో గుంటూరుకు బయల్దేరుతున్న విషయం తెలుసుకున్న లలిత్‌బాబు తన సోదరుడు అశోక్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. ఆరోజు బస్సు ప్రయాణం వీలు కాకపోవడంతో నాగరాజు విశాఖపట్నం వచ్చి రాయగడ-గుంటూరు రైలులో బీ1 బోగీలో ఎక్కాడు.

వీవోఐపీల ద్వారా సమాచారం

సెల్‌ఫోన్లలో మాట్లాడుకున్నా, వాట్సాప్ కాల్స్ చేసినా పోలీసులు పసిగట్టేస్తారనుకున్న లలిత్‌బాబు వీవోఐపీ (వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్) ద్వారా కాల్స్ మాట్లాడుకునేవాడు. నాగరాజు బీ1 బోగీలో ఎక్కుతున్నాడని సమాచారం ఇచ్చాడు. అశోక్‌కుమార్ మఫ్టీలో ఉండే పోలీసు మాదిరిగా తయారయ్యాడు. తలపై టోపీ పెట్టుకుని, మాస్క్ ధరించి పోలీసు మాదిరిగా వైజాగ్ రైల్వేస్టేషన్‌లో బోగీలోకి ఎక్కాడు. అక్కడి నుంచి విజయవాడ వరకు ప్రయాణించాడు. నాగరాజు లోయర్ బెర్త్‌పై గాఢనిద్రలో ఉన్నాడు. 1వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో దీన్ని గమనించి బెర్త్ కింద ఉన్న నగదు బ్యాగ్‌ను కాజేశాడు. రైలు విజయవాడ స్టేషన్‌కు రాగానే ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై దిగి ప్రయాణికుడిలా బయటకు వచ్చాడు. అక్కడి నుంచి ఆటోలో వారధి దాటి తాడేపల్లి వరకు వెళ్లాడు. అక్కడ బస్సు ఎక్కి మంగళగిరి చేరుకున్నాడు. ప్రకాశం జిల్లాకు బస్సులో వెళ్లాడు. తర్వాత తెర్లాం నుంచి లలిత్‌బాబు ప్రకాశం జిల్లాకు వెళ్లాడు. ఇద్దరూ కలిసి రూ.87 లక్షల్లో రూ.2.50 లక్షలను ఖర్చు చేశారు. మిగిలిన డబ్బుతో చెన్నైలో ఆస్తులు కొనడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన జీఆర్పీ పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేపట్టారు. వైజాగ్, విజయవాడ రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ముందుగా పోలీసులు అశోక్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత లలిత్‌బాబు పేరు బయటకొచ్చింది. వారి నుంచి రూ.84.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ పొన్నుస్వామి, ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్‌తో పాటు సిబ్బందిని అధికారులు అభినందించారు.

పత్తి తీతకు వలస కూలీలు

▸▸ రైలులో తర్లుబాడు నుంచి రాకపోకలు


కూలీల కోసం దొనకొండ రైల్వేస్టేషన్ వద్ద సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు, ఆటోలు

దొనకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలం లో పత్తి తీతకు కూలీల కొరత తీవ్రమైంది. ఈక్రమం లో తర్లుబాడు నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. వీ రంతా రైలులో తర్లుబాడు చేరుకుంటారు. అక్కడినుంచి రైతులు ట్రాక్టర్లు, ఆటోలు ఏర్పాటుచేసి కూలీలను పొ లాలకు తీసుకెళుతున్నారు. పనిముగిసిన అనంతరం సాయంత్రం కూడా ఇలాగే తర్లుబాడుకు వెళుతున్నారు. ఈవిధంగా వందకుపైగా కూలీలు వస్తున్నారు.

హుబ్లీ నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో తర్లుబాడులో ఉదయం 7గంటలకు బయలుదేరి దొన కొండకు 7.45 గంటలకు చేరుతున్నారు. మండలంలోని గంగదేవిపల్లి, చిన్నగుడిపాడు తదితర గ్రామాలకు చెం దిన రైతులు ఆసమయానికి రైల్వేస్టేషన్‌లో ట్రాక్టర్లు, ఆటోలు ఏర్పాటుచేసి కూలీలను పత్తి పొలాలకు తరలి స్తున్నారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు వారి ని రైల్వేస్టేషన్‌కు చేరుస్తారు. సాయంత్రం 5.15 గంటలకు దొనకొండకు వచ్చే విజ యవాడ నుంచి హుబ్లీ వెళ్లే రైలు లో కూలీలు తర్లుబాడుకు చేరు కుంటున్నారు. కేజీ పత్తి తీసినం దుకు రూ.16 నుంచి రూ.18 వరకు రైతులు చెల్లిస్తున్నారు. ఒకొక్కరు దాదాపు 20 కేజీల వర కు పత్తి తీస్తుంటారు.

దొనకొండ మండలంలో దాదాపు 2500 హెక్టార్లలో పత్తి సాగుచేశారు. పంట చేతికందే సమయంలో ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్న సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల మాత్రమే దక్కేలా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తిరిగి వర్షం కురుస్తుందనే సమాచారంతో మిగిలిన పంట దెబ్బతినకుండా కాపాడుకునేందుకు పత్తి తీతను రైతులు ముమ్మరంగా చేస్తున్నారు. ఈక్రమంలో కూలీల కొరత ఏర్పడటంతో తర్లుబాడు నుంచి కూలీలను రప్పించి పత్తి తీస్తున్నారు.

ఎయిడెడ్ టీచర్ల వివరాలు కోరిన డీఈవో

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసేందుకు అడుగు ముందుకు పడింది. ఎప్పటినుంచో హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఎయిడెడ్ టీచర్ల వివరాలను ప్రభుత్వం కోరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వారి వివరాలను డీఈవో కిరణ్‌కుమార్ కోరినట్లు ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయి ఐడీ, సీఎఫ్ఎంఎస్, టీచర్ ఇంటి పేరు, పాఠశాల పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలను డీఈవో కోరారు. నితర వివరాలను గూగుల్ షీట్‌లో వెంటనే డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం పోక్సో యాక్ట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు సాధ్యమైనంత వరకు సమీప బంధువుల ద్వారానో, తెలిసిన వారి ద్వారా జరుగుతాయని అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ద్వారా జీతం పొందేవారు పోక్స్ నేరాలలో పాల్గొన్నట్లు తేలితే 20 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువైన శిక్షలు పడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా కలెక్టర్‌కు అవార్డు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాటర్‌షెడ్ పథకంలో పీసీపల్లి మండలం మురుగమ్మి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో లభించిన అవార్డును మంగళవారం కలెక్టర్ రాజాబాబు అందుకోనున్నారు. ఢిల్లీలో మంగళవారం జరగనున్న కార్యక్రమం నేపథ్యంలో సోమవారం కలెక్టర్ బయలు దేరివెళ్లారు. కలెక్టర్‌తో పాటు డ్వామా వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు నిర్వాహకులతోపాటు ఒక విటుడు, ఒక స్త్రీని అదుపులోకి తీసుకున్నట్లు ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలో ఇరువురు మహిళలు, ఒక పురుషుడు కలిసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

భర్త కాపురానికి తీసుకెళ్ల లేదని భార్య ఆందోళన

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశించినా తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ వివాహిత సోమవారం స్థానిక రాజీవ్‌నగర్‌లో ఎన్‌బీకే రెసిడెన్సీలో ఆందోళనకు దిగింది. వివరాలలోకి వెళితే... తన భర్త 20 ఏళ్ల కిందట వివాహం చేసుకొని పిల్లలు పుట్టిన తరువాత ఇంటి నుంచి గెంటివేశాడని బాధితురాలు వాపోతుంది. అదే క్రమంలో తన భర్త చెడు వ్యసనాలకు బానిసై విడాకులకు కోర్టును ఆశ్రయించాడని, కోర్టు.. భార్యాభర్తలు కలిసి కాపురం చేయాలని ఆదేశించింది. మూడునెలలు గడుస్తున్నా తన బిడ్డలను చూపించకుండా కాపురానికి తీసుకెళ్లకుండా మానసిక క్షోభ పెడుతున్నారని ఆందోళనకు దిగారు. ఈమేరకు తాలూకా పోలీసులు బాధితురాలును పిలిచి విచారణ చేపట్టారు.

పి.నాయుడుపాలెంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు వినతి

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పి.నాయుడుపాలెంలో వలసదారుల కుటుంబంలో పిల్లల కోసం సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి మంజూరు చేసినట్లు ఎంఈవో నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీనుంచి 44 మంది విద్యార్థులకు హాస్టల్‌లో సౌకర్యం ఉంటుందని తెలిపారు. నిర్వహణకు ఆసక్తి కల్గిన ఎన్‌జీఓలు, ఎస్‌హెచ్‌జీల నుంచి ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9505032613నంబరులో సంప్రదించాలని కోరారు.

చీమకుర్తిలో వైభవంగా కోటి దీపోత్సవం

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో సాక్షిరామలింగేశ్వరాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. పరమశివుని చిత్రం చుట్టూ చేసిన దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. మండల పరిధిలోని అన్ని శివాలయాల్లో చివరి కార్తీక సోమవారం నాడు విశేషంగా పూజలు జరిపారు.



సాక్షిరామలింగేశ్వరాలయంలో కోటి దీపోత్సవంలో భక్తులు

మద్దిపాడులో...

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు గంగాధర్ రావు పంతులు ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అరి సురేంద్రబాబు, నరసింహారావులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

సుదర్శన యజ్ఞంతో లోక కల్యాణం

ఒంగోలు నగరంలో తాళ్లపాక హరి నారాయణాచార్యులు పర్యటన

ఒంగోలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులకు(12వ తరం) చెందిన తాళ్లపాక హరినారాయణాచార్యులు సతీసమేతంగా సోమవారం సాయంత్రం ఒంగోలు నగరంలో పర్యటించారు. వారు గడియారం వారి వీధిలోని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి పూజా కార్యక్రమంలో హరినారాయణాచార్యులు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాముడు రాఘవుడు అనే అన్నమాచార్య కీర్తనను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోదండరామ స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనారసింహ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించటం ఎంతో ఆనందదాయకమని, ఇది లోకకల్యాణానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం హరినారాయణాచార్యులును ఘడియారం సుబ్బయ్య శర్మ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి మహంకాళి వెంకటశేషయ్య, కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులు మైనంపాటి సాయికుమార్, భక్తులు పాల్గొన్నారు.



హరినారాయణాచార్యులను సన్మానిస్తున్న దేవస్థాన నిర్వాహకులు

'జడా'కు ఘన నివాళి

నాటి స్మృతులను గుర్తు చేసుకున్న పీఎస్ఎఫ్ శ్రేణులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్ ఫ్రంట్ (పీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత జడా కోటేశ్వరరావు 14వ వర్ధంతిని ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. పీఎస్ఎఫ్ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రంగా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఫ్రంట్ సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ శ్రేణులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, జడా అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, నిబద్ధత, విద్యార్థుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా స్థాపించిన పీఎస్ఎఫ్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. ఒంగోలు శర్మాకాలేజీలో స్టూడెంట్ ఫ్రంట్ ఏర్పాటుతో జడా కోటేశ్వరరావు ప్రతి ఒక్కరి గుండెలో నిలిచిపోయారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎందరో విద్యార్థులకు ఒంగోలులో వసతి కల్పించడంతోపాటు, అండగా నిలవడం, అలాగే వారి సమస్యలు పరిష్కరించడంలో బలమైన స్టూడెంట్ సంఘంగా పీఎస్ఎఫ్ ఎదిగిందని చెప్పారు. ఆయనను స్మరించుకోవడం ద్వారా చాలాఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని, కాలేజీలో గడిపిన మధురస్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరిబాబు, బాచిన చెంచుగరటయ్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ చైర్మన్ ఈదర మోహన్, సీనియర్ నాయకులు నల్లూరి కిశోర్, వైవీ సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, గేనం సుబ్బారావు, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి, కొత్తపట్నం జడ్పీటీసీ సభ్యుడు లంకపోతు అంజిరెడ్డి, ఈదర చిన్నారి, సుల్తాన్ బేగ్ (మస్తాన్), వై.శీనయ్య, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, చలపతి, బచ్చు వీరాంజనేయులు, జడా కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.



జడాకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ఈదర, బాచిన, డాక్టర్ సీతారామయ్య

సదస్సు మొదలు కాకముందే పెట్టుబడుల వరద

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన సీఐఐ గ్లోబల్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ దిశను పూర్తిగా మార్చే చరిత్రాత్మక వేదికగా నిలిచిందని, సదస్సు మొదలు కాకముందే పెట్టుబడి వరద మొదలైందని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెట్టుబడుల ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయన్నారు. 613 ఒప్పందాలు, రూ.13,25,716 కోట్లు పెట్టుబడులు రాకతో 16,13,188 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సదస్సుకు ముందు రోజు ప్రభుత్వం 35 ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమన్యాయం జరిగిందని నూకసాని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని చెప్పారు.



మాట్లాడుతున్న నూకసాని

కాజేసిన పొదుపు సంఘాల నిధులు రాబట్టాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

ఒంగోలు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరంపాడుహరిజనవాడ గ్రామపంచాయతీలో నొక్కేసిన స్వయం సహాయక సంఘాల నిధులు రాబట్టాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పొదుపు మహిళలు అర్జీ సమర్పించారు. ఆ సందర్భంగా స్వయంసహాయక సంఘాల మహిళలు మాట్లాడుతూ నిధులు స్వయం సహాయక సంఘాల నిధులు సుమారు రూ.50లక్షలు ఉండాల్సి ఉంది.. ప్రస్తుతం రూ.5వేలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆ నిధులు నొక్కేయటంలో అప్పటి ఏపీఎం గోపి, సీసీ సాంబయ్యల సహకారంతో కీపర్ దర్శి సుజాతతో కుమ్మక్కై నిధులు దోచుకున్నట్లు తెలిపారు. ఆ నిధులను రాబట్టి స్వయం సహాయక సంఘాల మహిళలు న్యాయం చేయాలని సుజాత, రత్తమ్మ కోరారు.

కుష్ఠు నివారణపై అవగాహన

పొన్నలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నివారణపై స్థానిక సచివాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన మాట్లాడుతూ కుష్ఠును సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు సర్వే కొనసాగుతున్నదని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ రవికిరణ్, వైద్య సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహించిన వైద్య అధికారులు, సిబ్బంది

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ కేవీపీ రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మంగమూరు రోడ్డులోని సుబ్బయ్యనగర్, ఎస్ఎస్‌పీ కాలువ, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్సన్, చంద్రయ్య నగర్, సరస్వతి శిశుమందిర్, ఎన్‌జీవో కాలనీ 7వలైన్‌లలో విద్యుత్తు అతరాయం ఏర్పడుతుందని అన్నారు. వినియోగదారులు గమనించి సహకరిచాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన

కొండపి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, చాణక్య జూనియర్ కళాశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మర్రిబోయిన శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. అక్కడ వసతులను చూశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆయన ఎంఈవో పి.రామారావుకు సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం సుబ్బారావు, అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ఎంఐఎస్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి సుమిత్ మిగ్ (35) మృతి చెందిన ఘటన మండలంలోని గజ్జలకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ఏఎస్ఐ వెంగళరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం జల్పైగురి జిల్లా బీర్‌పూర్ ప్రాంతానికి చెందిన సుమిత్ మిగ్ మాల్దా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. సహచరులతో కలసి వెల్డింగ్ పనులు చేసుకునేందుకు వాస్కోడిగామా రైలులో బెంగళూరుకు వెళుతున్నాడు. గజ్జలకొండ రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక మోసాలపై మూడు కేసులు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్థిక మోసాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మూడు కేసులు నమోదయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కాలేజీ రోడ్డులోని బజాజ్ ఆటో ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న తర్లుపాడు మండలం బుడ్డపల్లె గ్రామానికి చెందిన దేవెండ్ల శ్రీను రూ.6 లక్షల మేర ఈఎంఐలు వసూలు చేసుకుని కంపెనీకి కట్టలేదు. ఈ విషయమై మేనేజర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నిసార్లు డబ్బులు చెల్లించాలని అడిగినా శ్రీను స్పందించలేదు. దీంతో టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

- ప్రైవేటు చీటీ పాడుకున్న తనకు నిర్వాహకుడు రూ.3.80లక్షల మేర డబ్బులు ఇవ్వడంలేదని పట్టణానికి చెందిన సింగరి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జక్కా శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

- స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద ఇంటి సమీపంలో నివసించే పాలకేంద్రం నిర్వాహకుడు జంకె కోటిరెడ్డి ఇబ్బందుల్లో ఉండడంతో అవసరానికి ఎవరికీ తెలియకుండా ఇంట్లోని 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు ఇస్తే తనకు తిరిగి చెల్లించలేదని దేవెండ్ల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

రూ.1.35 లక్షలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ జూదరులు పోలీసులకు చిక్కారు. అర్బన్ సీఐ కె.సురేష్ కథనం ప్రకారం... ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.1.35 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.3,17,314 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,02,706, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.76,340, శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం వచ్చినట్లు తెలిపారు. పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు పార్వతి దంపతుల కుమారుడు వెంకట కిశోర్‌బాబు, మానస దంపతులు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.40 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

అవీఇవీ

గ్రామీణాభివృద్ధికి సొసైటీలు పట్టుగొమ్మలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎండీ వేణు, సభ్యులు

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సొసైటీ) గ్రామీణాభివృద్ధికి పట్టుగొమ్మలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మేనేజింగ్ డైరెక్టర్ డి. వేణు తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను సోమవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సహకార పతాకాన్ని ఎండీ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. జోనల్ సహకార విద్యాధికారి జి. శ్రీనివాసరావు, ఒంగోలు సూపర్‌బజారు ఎండీ సురేంద్రకుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీబీఎస్ కుమార్, మారుతి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు కార్యాలయ సిబ్బందిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ భవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ పర్యటన నేపథ్యంలో ఈ ఘటన జరగడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దుంపా రవణమ్మ, పాలడుగు రాజీవ్, భూమిరెడ్డి రవణమ్మ, లంకపోతు అంజిరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, వడ్లమూడి వాణి, పేరం ప్రసన్న, కరుణాకర్, వేముల శ్రీకాంత్, ముల్లంగి రవీంద్రారెడ్డి, పల్నాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ, పట్టణ పథకాలపై చర్చించిన మాగుంట



మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలో కొచ్చిన్‌లో సోమవారం జరిగిన గృహ- పట్టణ పథకాలపై సోమవారం గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంట్ కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమీక్షించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రగృహ- పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థికశాఖ, కొచ్చిన్ స్మార్ట్‌మిషన్‌లిమిటెడ్, గ్రేటర్ కొచ్చిన్ అభివృద్ధి అథారిటీ, కొచ్చిన్ మునిసిపల్ కార్పొరేషన్, కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్, స్టేట్ బ్యాంకు, కెనరా బ్యాంకు, హడ్కో తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. భారత్‌మిషన్- అర్బన్, అమృత్, పీఎం ఆవాస్ యోజన, పీఎంఎస్‌వీఏ నిధి తదితర పథకాలపై చర్చించి అధికారులకు మాగుంట సూచనలు ఇచ్చారు.

అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఆర్వో చినఓబులేశు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని వచ్చేనెల 6వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశు సూచించారు. దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రచురించిన కరపత్రాలను సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు వచ్చే నెల 6వ తేదీన కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు పత్రా బంగారం, మాదిగ చైతన్య వేదిక కన్వీనర్ దిలీప్, మాల యువసేన ఆర్గనైజర్ ఉన్నారు.

'మీకోసం'లో రెండు అర్జీలు

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రెండు అర్జీలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వెంటనే భూమికి కొలతలు వేయాలని ఆమె సర్వేయర్లకు సూచించారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, వారిలో చైతన్యం పెంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు చెప్పారు. ప్రపంచ మూర్ఛ వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూర్ఛ వ్యాధికి గురైన వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూర్ఛ వ్యాధి వచ్చినపుడు వారి చేతిలో తాళాలు పెట్టకుండా బాధితుల నాలుక కొరుక్కోకుండా నోటిలో ఏదైనా గట్టి వస్తువు పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డాక్టర్లు నటరాజ్, ఎస్.హరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు, ప్రభాకర్, సీఎస్ఆర్ఎంవో మాధవీలత పాల్గొన్నారు.

వైభవంగా సోమవార పూజలు



మార్కాపురంలో అర్ధనారీశ్వర అలంకారంలో జగదాంబమాత



దోర్నాలలో కోటి దిపోత్సవం



గిద్దలూరులో కుసుమ హరనాథుల కల్యాణోత్సవం



వైపాలెంలో రుద్రాక్ష శివలింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఆఖరి సోమవారాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో మార్కండేశ్వరస్వామి, జగదాంబ దర్శనానికి వేకువజాము నుంచే బారులు తీరారు. నాగదేవతలు, నవగ్రహాలకు పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజ శర్మ, ఆంజనేయశర్మ మార్కండేశ్వరస్వామిని శ్రీకాళహస్తీస్వరునిగా, జగదాంబను అర్ధనారీశ్వరిగా విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు సౌఖర్యాలు కల్పించారు.

కల్యాణం కమనీయం

గిద్దలూరు : పట్టణంలోని శ్రీ కుసుమ హరనాథ క్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం శ్రీకుసుమ హరనాథుల లీలా కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. శాస్త్రోక్తంగా కుసుమ హరనాథులకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూ జలు నిర్వహించారు. అనంతరం జరిగిన ఆర్యవైశ్య కార్తీక వనభోజన కార్యక్రమానికి సుమారు 2500 మంది ఆర్యవైశ్యులు హాజరయ్యారు. కార్యక్రమాలలో కుసుమ హరనాథ భక్తసమాజం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు, వివిధ దేవస్థానాల ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్తీక మాస చివరి సోమవార పూ జలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజా ము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవాలయం, శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం, పలు దేవాలయాలలో, కేఎస్‌పల్లి భీమలింగేశ్వరస్వామి దేవాలయం, ముండ్లపాడు భవాని శంకర ఆలయం, తదితర దేవాలయాలలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి.

ఘనంగా కోటి దీపోత్సవం

కంభం : కార్తీక సోమవారం సందర్భంగా కంభం కోటా సత్యమాంబదేవీ ఆలయం ప్రాంగాణంలో మహిళా భక్తులు కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. కంభం, అర్ధవీడు మండలాలలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మారుమోగాయి. కంభం కోటేశ్వర స్వామి దేవాలయం, చిన్న కంభం వీరభద్రస్వామి, తురిమెళ్లలోని కనక సురభేశ్వరాలయం, రావిపాడు కోటేశ్వర స్వామి దేవాలయం, మొహిద్దీన్ పురంలో కల్పనే శ్వర స్వామి దేవాలయం, నాగులవరం కొండపై వెలసిన శివపార్వతుల దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : కార్తీక ఆఖరి సోమవారం సందర్భంగా కొప్పుకొండపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ సమీపంలో కోటి దిపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నేపాల్ రుద్రాక్షలతో ఏర్పా టు చేసిన 7 అడుగుల శివలింగానికి అభి షేకం, బిల్వార్చన, మహా రుద్రాభిషేకం, కార్తీక దిపోత్సవ వేడుకలను భావనాథ అఘోర మహారాజ్, త్రిపుర భైరవేశ్వరానంద సామిజీ, రుద్ర శివానంద సామిజీ, కాశీ మహాకాళీ కాలభైరవ అఘోర సాధక్ రమణ అఘోర, సత్యజ్ఞానాంద గిరి స్వామి ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి శివనామస్మరణ చేశారు.

పెద్ద దోర్నాల : శివాలయాలు కార్తీకశోభతో వెల్లివిరిశాయి. శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయంలోని శివాలయం, సాయి మందిరం, అయ్యప్పస్వామి, కన్యకాపరమేశ్వరీ దేవాలయం, మోట్ల మల్లికార్జున స్వామి దేవాలయం, తిమ్మాపురంలోని చౌడేశ్వరి దేవాలయం భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఈ క్రమంలో ఆయా ఆలయాల్లో గౌరీ శంకరులకు కల్యాణం జరిపించారు. అనంతరం ఈశ్వరునికి రుద్రాభిషేకం చేశారు. అమ్మవారి శాలలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు.



రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న పుల్లారెడ్డి

ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

రాచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి అన్నారు. రామాపురం సొసైటీ సహకారంతో సోమవారం ఆయన మేడంవారిపల్లి గ్రామంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. యూరియా, డీఏపీ, 20:20:0:13 ఎరువులను ఎమ్మార్పీ ధరలకు సరఫరా చేస్తున్నామన్నారు. ఏవో షేక్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఎరువులు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు పొందవచ్చు అన్నారు.కార్యక్రమంలో గుడిమెట్ల సర్పంచ్ రెడ్డి కాశిరెడ్డి, సొసైటీ సీఈవో అంజిబాబు, డైరెక్టర్లు ఈశ్వర్ రెడ్డి, నారాయణ, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు రమేష్, రామేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణీకుల సలహాలు, సూచనలు, ప్రయాణంలో ఇబ్బందులపై మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శంకరరావు సోమవారం తెలిపారు. పొదిలి డిపో పరిధిలో పొదిలి, దర్శి, కొనకనకనమిట్ల, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాల ప్రజలు తమ అభిప్రాయాలను చెప్పాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలకు వచ్చే ఆర్టీసీ బస్సులు సకాలంలో రాకపోయినా, ప్రయాణికులు ఉన్నచోట ఆపకపోయినా, డ్రైవర్, కండక్టర్ ప్రవర్తనలో ఇబ్బందులున్నా మం గళవారం సాయంత్రం 4గంటల నుంచి 5 వరకు 9959225700 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన సూచించారు. మీ సలహాలు, అభిప్రాయాలను కూడా తెలపాలని కోరారు.

ఉచిత టెట్ కోచింగ్‌ను వినియోగించుకోవాలి

కంభం నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్ మెంట్ వారు నిర్వహించే 30రోజుల ఉచిత టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ కోచింగ్‌ను వినియోగించుకోవాలని ఎంఈవో అబ్దుల్ సత్తార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజబిలిటీ పరీక్షకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థులకు ఈ శిక్షణ బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని మైనారిటీ విద్యార్థులకు ఉర్దూ తెలుగు మాధ్యమాలలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 9492716638 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

గిద్దలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలలో కేంద్రీకృత వంటశాలలను ఏర్పాటు వల్ల నాణ్యమైన భోజనం అందదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ నరసింహులు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ప్రతినిధులు లక్ష్మీదేవి, కుమారి, నరసమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కంభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నా స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని సయ్యద్ దిలావత్ అనే బాధితుడు సోమవారం తహసీల్దార్ కిరణ్‌కు కందులాపురం కార్యదర్శి జోషులకు, ఎస్సై నరసింహారావుకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దిలావత్ మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీలో మా నాన్న సర్వే నెంబరు 161లో 9సెంట్ల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారని, స్వామి అనే వ్యక్తి ఆ స్థలం నాదంటూ దౌర్జన్యంగా ఆక్రమించి ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపట్టారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్థలంపై కోర్టులో కూడా విచారణలో ఉందని రానున్న కోర్టు తీర్పును గౌరవించి పనులను నిలిపివేయాలని కోరినట్లు తెలిపారు.

సదరం స్లాట్ బుకింగ్‌లో సమస్యలను పరిష్కరించాలని వినతి

పెద్ద దోర్నాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు మెడికల్ సర్టిఫికెట్లు ధ్రువీకరించే సదరం క్యాంపులో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు తహసీల్దారు అశోక్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతు సంఘం జిల్లా నాయకులు డీ సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుంచి దివ్యాంగులకు ధ్రువీకరించేందుకు మండల సచివాలయాల్లో స్లాట్ బుకింగు చేసుకోవాలని ప్రకటించిందన్నారు. అయితే మార్కాపురం డివిజన్‌లో ఎక్కడా ఒక్కరికి కూడా స్లాట్ బుకింగ్ కావడం లేదని, సచివాలయం సిబ్బంది సర్వర్ పని చేయలేదని దీంతో దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు డీ తిరుపతిరెడ్డి, రాజేశేఖర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు పీ పిచ్చయ్య పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి సుమిత్ మిగ్గ్ (35) మృతి చెందిన ఘటన మండలంలోని గజ్జలకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ఏఎస్ఐ కే వెంగళరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం జల్పైగురి జిల్లా బీర్‌పూర్ ప్రాంతానికి చెందిన సుమిత్ మిగ్గ్ మాల్డా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. సహచరులతో కలసి వెల్డింగ్ ఉపాధి పనులు చేసుకునేందుకు వాస్కోడిగామా రైలులో బెంగళూరుకు వెళుతున్నాడు. గజ్జలకొండ రైల్వే స్టేషన్ ప్రాంతంలో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక మోసాలపై మూడు కేసులు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్థిక మోసాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మూడు కేసులు నమోదయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కాలేజీ రోడ్డులోని బజాజ్ ఆటో ఫైనాన్స్ కంపెనీకిలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్న తర్లుపాడు మండలం బుడ్డపల్లె గ్రామానికి చెందిన దేవెండ్ల శ్రీను రూ.6లక్షల మేర ఈఎంఐలు వసూలు చేసుకుని కంపెనీకి కట్టలేదు. ఈ విషయమై మేనేజర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నిసార్లు డబ్బులు చెల్లించమని అడిగినా శ్రీను స్పందించలేదు. దీంతో టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

- ప్రైవేటు చీటీ పాడుకున్న తనకు నిర్వాహకుడు రూ.3.80లక్షల మేర డబ్బులు ఇవ్వడంలేదని పట్టణానికి చెందిన సింగరి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జక్కా శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.
- స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద ఇంటి సమీపంలో నివసించే పాలకేంద్రం నిర్వాహకుడు జంకె కోటిరెడ్డి ఇబ్బందుల్లో ఉండడంతో అవసరానికి ఎవరికీ తెలియకుండా ఇంట్లోని 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు ఇస్తే తనకు తిరిగి చెల్లించలేదని దేవెండ్ల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న కళావేదిక కార్యదర్శి షకీల

అలరించిన కవి సమ్మేళనం

గిద్దలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. రైల్వేశాఖ సీనియర్ కమర్షియల్ క్లర్క్, శ్రీ కళావేదిక జిల్లా మహిళా కార్యదర్శి షేక్ షకీల మాట్లాడుతూ మనుషులు ఉన్నంత కాలం కవిత్వం సజీవింగా ఉంటుందని, ఆలోచింప చేసే శక్తి ద్వారా కవిత్వంలో స్పందించే లక్షణం ఉంటుందని, సమాజ రుగ్మతలు రూపుమాపేందుకు కవిత్వం ఎంతో అవసరమన్నారు. ఈసందర్భంగా బాలబాలికలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించగా 60 మంది పాల్గొన్నారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, పలుశాఖల రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశభక్తి గేయాలు ఆలపించిన విద్యార్థులు

త్రిపురాంతకం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు రామాంజినాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా మాతృభాష గొప్పతనాన్ని వక్తలు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన తెలుగు ఉపాధ్యాయుడు ఇమ్మడిశెట్టి సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో నాసరయ్య, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, సుధారాణి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : కవితలు, రచనలపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఎంఈవో-2 మల్లునాయక్ కవితలు, రచయితలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం పద్య పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథపాలకురాలు జాన్సీ ఉపాధ్యాయిని అంజలి పాల్గొన్నారు.

రాచర్ల : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్నాయని అన్నారు. ఈ పోటీల్లో 55మంది విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈనెల 10వ తేదీ బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథపాలకుడు పాండు పాల్గొన్నారు.

హిందూ శ్మశానవాటికలో కంప తొలగింపు



చిల్లచెట్ల తొలగింపు చర్యలు పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాలాజీ థియేటర్ సమీపంలోని సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటికలో విపరీతంగా పెరిగిన చిల్లకంపను ఎక్స్‌కవేటర్‌తో సోమవారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పర్యవేణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ చిల్లకంపతో స్మశానంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో కంప తొలగింపు చేపట్టామన్నారు. భవిష్యత్తులో కూడా క్రమం తప్పకుండా శ్మశానంలో కంప తొలగిస్తామన్నారు.

అడ్డంకిగా మారిన భారీ చెట్లు

ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారికి మధ్యలో డివైడర్‌పై ఆహ్లాదకరంగా ఉండేందుకు మొక్కలను నాటారు. అవి నేడు పెద్ద వృక్షాలు అయ్యాయి. వాటి సంరక్షణను అధికారులు మరవడంతో ఏపుగా పెరిగిన చెట్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలకు ఈ చెట్లు అడ్డంకిగా మారుతున్నాయి. గతంలో కూడా ఈ చెట్ల వలన ప్రమాదాలు కూడా జరిగిన సందర్భాలున్నాయి. చెట్లకు ఏపుగా పెరిగిన కొమ్మలను నరికి సరిచేయాలని, చిన్నచిన్న పూలమొక్కలను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పెద్ద పెద్ద చెట్లు

అట్టహాసంగా కందుల జన్మదిన వేడుకలు





మార్కాపురం, పొదిలిలో కందులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆయన నివాసంలో అట్టహాసంగా జరిగాయి. అర్ధరాత్రి నుంచి ఎమ్మెల్యే గృహంలో కోలాహలం నెలకొంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, కేకులు కట్ చేయించారు. ఉదయం త్రిపురాంతకంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11.00 గంటల నుంచి ఆయన నివాసానికి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చేరుకున్నారు. పూలమాలలు వేసి దుశ్శాలువాలు కప్పి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు, పలువురు పుస్తకాలు, పెన్నులు ఆయనకు గిఫ్ట్‌గా అందించారు. అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ కేకును ఈ సందర్భంగా కట్ చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి, పఠాన్ ఇబ్రహీంఖాన్, వెన్నా పోలిరెడ్డి, సూర పరమేశ్వరరెడ్డి, గొట్టిపాటి సూరి, గుప్తా ప్రసాద్, పెరికె సుఖదేవ్, అల్లూరిరెడ్డి, దొడ్డా నాగిరెడ్డి, దియ్యాల వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, అభిమానులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో అన్నదానం

మార్కాపురం వన్‌టౌన్ : ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా మార్కాపురం కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ యువ నాయకులు కందుల రోహిత్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టి.వెంకటరమణ, సయ్యద్ కరీం, యక్కలి మల్లికార్జున, టీవీఎస్ సత్యం, షాబహుద్దూర్, కె.శ్రీనివాసులు, షామహ్మద్ పాల్గొన్నారు.

పొదిలి : ఎమ్మెల్యే కందుల పుట్టినరోజు వేడుకలను విశ్వనాథపురం, పెద్దబస్టాండ్, గునుపూడి భాస్కర్ ఇంటివద్ద ఘనంగా నిర్వహించారు. పట్టణంలో విశ్వనాథపురం సెంటర్లో ఏఎంసీ చైర్మన్ సమ్మద్ ఇమాంమ్‌సాహెబ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో మధ్య నారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం భాస్కర్ సమకూర్చిన చీరలను నిరుపేదలకు ఎమ్మెల్యే పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో కందుల పూజలు

త్రిపురాంతకం : త్రిపురాంతకంలోని దేవస్థానం ఉభయ దేవాలయాల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పూజలు చేశారు. కార్తీక సోమవారంతో పాటు ఆయన పుట్టినరోజు సందర్భంగా స్వామివారితోపాటు బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి అనిల్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆయనతోపాటు మార్కాపురం ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ నేతలు ఉన్నారు.

టీఎన్‌యూఎఫ్ శుభాకాంక్షలు

పెద్దదోర్నాల : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందుల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు బాలగురువులు అధ్యక్షతన కందులకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రహమాన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బురానిపీరా, వెంకటేశ్వ ర్లు, ప్రసాద్, అశోక్‌రెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

- నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి
- టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మోడల్ డిగ్రీ కాలేజీలో ఈనెల 20వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్తంగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో 9 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 10 వతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీయువకులు 19-30 సంవత్సరంలోపు వయస్సు వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు పాన్, ఆధార్ కార్డు, సర్టిఫికెట్ల జిరాక్సుతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. రూ.13 వేల నుంచి రూ.20వేల జీతం ఉంటుందని తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ విజయకుమారి 9553945387, 8187084281 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మురుగు ఇలా.. అడుగు వేసేదెలా!



అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిలిచి ఉన్న మురుగునీరు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో నాలుగు కూడళ్ల వద్ద నిత్యం మురుగునీరు నిలిచే ఉంటుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అయ్యప్ప దీక్షధారులు ఆలయానికి మురుగు నీటిలోనే వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. అటుగా వెళ్లే ప్రజలు మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నారు.

కదలని మురుగు

దోమలతో అల్లాడుతున్న ప్రజలు

ఎర్రగొండపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెంలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వల్లో నీరు కదలడం లేదు. చెత్తాచెదారాలతో కాల్వ నిండి కంపుకొడుతోంది. దోమలు పెరిగి ప్రజలు అల్లాడుతున్నారు. రోగాలు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ కార్యక్రమంలోనైనా మురుగు కాల్వలను శుభ్రం చేయించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

రూ.1.35 లక్షలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ జూదరులు పోలీసులకు చిక్కారు. అర్బన్ సీఐ కె.సురేష్ కథనం ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకుని 1.35 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- వైద్యఆరోగ్యశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్యశాయ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. సోమవారం అమరావతిలో మంత్రి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆసుపత్రి పరిస్థితిని వివరించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత, అవసరమైన వైద్యసేవలతో పాటు తగినన్ని పరికరాలు కూడా లేవని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. కనిగిరి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై నివేదికను మంత్రికి డాక్టర్ ఉగ్ర సమర్పించారు. ఆసుపత్రిలో వైద్యుల సంఖ్యను కూడా తక్షణం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే వారికి అందించే అత్యవసర సేవలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలపై మంత్రి సత్యకుమార్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కోసం మరో కేంద్రాన్ని మంజూరు చేసినందుకు మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కృతజ్ఞతలు తెలిపారు. దీంతో కనిగిరి ప్రాంత డయాలసిస్ బాధితులకు సత్వర సేవలతో పాటు, ఎక్కువ మంది బాధితులకు వైద్య సేవలు అందించేందుకు వెసులుబాటు ఏర్పడునుందని తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ఉన్నారు.

రాష్ట్రంవైపు పారిశ్రామికవేత్తల చూపు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో 13.5 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదరటంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో ప్రజా ప్రభుత్వం సమర్థవంతమైన సుపరిపాలన సాగిస్తుందన్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ చొరవతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని వివరించారు.

రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్న విషయాన్ని జీర్ణించుకోలేక వైసీపీ సైకో బ్యాచ్ అర్థంలేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క రూపాయి కూడా పెట్టుబడులు తీసుకురాలేని నాటి అసమర్థ పాలకులు ఇప్పుడు అసమర్థమైన ఆరోపణలు చేయటం శోచనీయమన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వారికి తగిన గుణపాఠం చెబుతారని డాక్టర్ లక్ష్మి స్పష్టం చేశారు.

త్వరితగతిన అర్జీలు పరిష్కరిస్తాం

- ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలపై అందజేసిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరిస్తామని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మీ అన్నారు. తమ కార్యాలయాల్లో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలిస్తామన్నారు. ఆయా గ్రామ రికార్డులను పరిశీలించిన అనంతరం రికార్డుల ఆధారంగా తగిన నిర్ణయంతో కూడి సమాధానాన్ని నిర్ణీత సమయంలో తెలియ చేస్తామన్నారు. భూ సంబంధ వివాదాలు ఉంటే వాటిని గ్రామస్థాయిలోని రెవెన్యూ అధికారిని సంప్రదించి ఆభూమి వివరాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ, అసైన్డ్, వాగు, పోరంబోకు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో కార్యాలయంలో భూ సమస్యలపై పది అర్జీలను అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 8 అర్జీలు రాగా, వాటిలో ఆరు భూసమస్యలకు సంబంధించినవి వచ్చినట్టు జయలక్ష్మీ తెలిపారు.



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

- భక్తి శ్రద్ధలతో చివరి సోమవారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో శైవ క్షేత్రాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా భైరవకోన, మిట్టపాలెం శ్రీనారాయణస్వామి భక్తులతో కిటకిటలాడాయి. భైరవకొనలోని త్రిముఖ దుర్గాంబ అమ్మవారి క్షేత్రంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థాన ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆయా దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, శ్యాంసుందర్, టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, ఈవోలు నరసింహబాబు, వంశీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

అలాగే, పామూరులోని శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా భక్తులు దేవస్థాన ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి కోనేరులో వదిలారు. సాయంత్రం భక్తులకు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో అల్పాహార ప్రసాదాన్ని పంచిపెట్టారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాగా, సీఎస్‌పురం మండలంలోని భైరవకోన క్షేత్రంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు జలపాతం వద్ద సందడి చేశారు. ఈసందర్భంగా కోనేరులో కార్తీక పవిత్ర స్నానాలు ఆచరించారు. జలపాత అందాలను తిలకించి సందడి చేశారు. అనంతరం త్రిముఖ దుర్గాంబ అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో ముండ్లమూరులోని పీర్లంకమ్మ అమ్మవారు

ముండ్లమూరు: మండలంలోని శివాలయాలు కార్తీక చివరి సోమవారం సందర్భంగా శివనామ స్మరణతో మారుమ్రోగాయి. ఉదయం భక్తులు శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివునికి పూజలు నిర్వహించారు.

మండలంలోని పసుపుగల్లులోని శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో అభిషేకాలు, నందీశ్వరునికి పాలభిషేకం నిర్వహించారు. ముండ్లమూరులోని శ్రీమల్లమాంబ మల్లికార్జున స్వామి, పులిపాడులోని శ్రీగంగాపార్వతి సమేత ఊర్లేశ్వర స్వామి, మారెళ్ళలోని చెన్నమల్లేశ్వర స్వామి, ఈదరలోని రాజరాజేశ్వరి దేవి, పెద ఉల్లగల్లులోని గంగా పార్వతి సమేత అన్నపూర్ణాదేవి, పోలవరం, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

ముండ్లమూరులోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

మహారుద్రపీఠంలో శివలింగాల ప్రతిష్ఠ

పీసీపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పెదయిర్లపాడులోని మహారుద్రపీఠంలో సోమవారం నిర్వహించిన శివలింగాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈకార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్తీక అన్న సమారాధనలో విరివిగా పాల్గొన్నారు. శివలింగాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అర్చకులు పలుకూరి సుబ్బారావు స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.



భైరవకోన జలపాతం వద్ద సందడి చేస్తున్న భక్తులు

అర్హులందరికీ పట్టాలు పంపిణీ

తాళ్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యనగర్ కాలనీ వాసులకు చెందిన 62 మందికి సాగు భూమి పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తహసీల్దార్ బీవీ రమణారావు ఎస్టీలకు హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం ఏకలవ్యనగర్ ఎస్టీ కాలనీవాసులు తహసీల్దార్‌ను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కొంతమందికే పట్టాలు ఇచ్చారని చెప్పారు. మిగిలిన వారు ఏన్నో ఏళ్లుగా తిరుగుతున్నా ఇవ్వడం లేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రమణారావు మాట్లాడుతూ గతంలో ఆకాలనీకి చెందిన 46 మంది హైకోర్టును ఆశ్రయించారన్నారు. వారికి పట్టాలు పంపిణీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. పట్టాల పంపిణీ జరగక పోవటంతో 46 మందిలో 31 మంది మరలా హైకోర్టుకు వెళ్లినట్టు చెప్పారు. విచారించిన న్యాయం స్థానం 31 మందికి పట్టాలు పంపిణీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అర్హతగల వారి జాబితాను సిద్ధం చేశామన్నారు. వారిలో 26 మందికి పట్టాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఆప్రాంతంలో ఎంతో కాలంగా నివాసముంటూ భూములు సాగుచేసుకుంటున్న అర్హులను 62 మందిని గుర్తించామన్నారు. రెండో జాబితాలో వారికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఎస్టీలకు న్యాయం చేస్తామన్నారు. ఎవరూ అపోహ పడవద్దని, రెండో జాబితా సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. అర్హులందరికీ పట్టాల పంపిణీ చేస్తామని తహసీల్దార్ బీవీ రమణారావు ఎస్టీలకు హామీ ఇచ్చారు.

తరగతి గదులు నిర్మించారు.. ప్రహరీ మరచారు!

- ప్రాంగణంలో సంచరిస్తున్న మూగజీవాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రహరీగోడకు నోచుకోని పెద్దన్నపాలెం గ్రామ ఆదర్శ పాఠశాల

దొనకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించారు. అయితే, ప్రహరీగోడ నిర్మాణం గురించి అధికారులు పట్టించుకోలేదు. దీంతో పాఠశాల భవనం చుట్టూ విషపురుగులు, గేదెలు, పందులు, కుక్కలు సంచరిస్తుండటంతో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరంటతో గ్రామస్థుడైన అప్పటి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కటారు వెంకటేశ్వర్లు పాఠశాల భవన నిర్మాణానికి దాతల సహకారంతో దాదాపు రూ.11 లక్షల వ్యయంతో 75 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈస్థలంలో కూటమి ప్రభుత్వంలో మన బడి.. మన భవిష్యత్తు నిధులతో తరగతి గదుల నిర్మాణం చేపట్టి ఈవిద్యా సంవత్సరంలో ప్రారంభించారు. పాఠశాల భవనానికి ప్రహరీగోడ లేకపోవటంతో పశువులు సంచరిస్తున్నాయి. అప్పుడప్పుడు విషపురుగులు సహితం కనబడుతున్నాయి. దీంతో తమ పిల్లలకు ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 80 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలను ప్రజాప్రభుత్వం ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మార్పుచేసింది. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశారేగాని విద్యార్థుల భద్రతపై అధికారులు, పాలకులు దృష్టి సారించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పాఠశాలకు తక్షణమే ప్రహరీగోడ, మరుగుదొడ్లు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.3,17,314 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,02,706, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.76,340, శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళ వచ్చినట్లు తెలిపారు. పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు పార్వతి దంపతుల కుమారుడు వెంకట కిశోర్‌బాబు, మానస దంపతులు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.40 వేలు విరాళంగా అందజేశారు.

మీ కోసంకు ఐదు అర్జీలు

ముండ్లమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు వచ్చినట్టు ఎల్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఇళ్ళ స్థలాల కోసం నాలుగు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యాసాగర్‌రెడ్డికి లయన్స్ క్లబ్ పురస్కారం

దర్శి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ పాలి సర్వీస్ అండ్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో పొన్నూరులో జరిగిన గ్యాంట్ కాంక్లేవ్ సమావేశంలో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అభినందన సర్టిఫికెట్‌ను కల్లూరి విద్యాసాగర్‌రెడ్డికి ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో జీఏటీ ఏరియా లీడర్ డీఎంజెఎఫ్ ములుపూరి ఉపేంద్ర, మల్టీపుల్ జీఈటీ కోఆర్డినేటర్ పీఎంజెఎఫ్ గద్దె శేషగిరిరావు, జిల్లా గవర్నర్ ఎంజేఎఫ్ సీహెచ్ హరిప్రసాదరావు, ప్రథమ గవర్నర్ పీఎంజెఎఫ్ రావిపూడి లక్ష్మీనారాయణ, క్యాబినెట్ సెక్రెటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ట్రెజరర్ సోమేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందులకు శుభాకాంక్షలు తెలిపిన టీఎన్‌యూఎస్

దొనకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురంలో సోమవారం జరిగిన వేడుకల్లో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు బాలగురువులు, అధ్యక్షుడు రెహమాన్, ప్రధాన కార్యదర్శి మండ్లా శ్రీనివాసులు, బురానీ పీరా, వెంకటేశ్వర్లు, ప్రసాదు, అశోక్‌రెడ్డి, కొండయ్యలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిచే కేకు కట్ చేయించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

స్వామిత్ర సర్వేలో పూర్తి వివరాలు తెలుసుకోండి

తాళ్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వామిత్ర సర్వేలో తమ నివాసాలు, ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదవుతున్నాయా, లేదా తెలుసుకోవాలని ఎంపీడీవో పి.అజిత అన్నారు. మండలంలోని మాధవరం గ్రామంలో సర్పంచ్ తాటికొండ రేణుక అధ్యక్షతన స్వామిత్ర సర్వే ఫేజ్-2 ప్రత్యేక గ్రామ సభ జరిగింది. గ్రామంలో సర్వే జరిగిన వివరాలు జిల్లా కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు 473 పీపీఎంలను పరిశీలించి గ్రామ సభ సమక్షంలో చదివి వినిపించారు. అందులో 152 మంది యజమానుల అంగీకారం తీసుకున్నారు. గృహయజమానులు పలు అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డి.నాగమల్లేశ్వరి, గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మవరాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి

ముండ్లమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర గ్రామ పంచాయతీ నుంచి కొమ్మవరం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని సోమవారం గ్రామ సచివాలయంలో తీర్మాణం చేశారు. 12 మంది వార్డు మెంబర్లకు గాను ఉప సర్పంచ్ మారెళ్ళ వీరమ్మతో పాటు ఎనిమిది మంది వార్డు మెంబర్లు తీర్మాణాన్ని ప్రతిపాదించారు. దీంతో ఏకగ్రీవంగా తీర్మాణాన్ని ఆమోదించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వి.ఏడుకొండలు, జి.నాగార్జు, ఎంపీటీసీ నాగమల్లి అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా గంగాధర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న గంగాధర్

వెలిగండ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా ఆర్.గంగాధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఉద్యోగన్నతిపై వెలిగండ్లకు వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అనంతరం కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్‌లతో దొనకొండ జడ్పీ పాఠశాల విద్యార్థులు

ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్‌తో విద్యార్థులకు ప్రయోజనం

దొనకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్‌లు ఎంతో ఉపయోగపడతాయని దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అన్నారు. పాఠశాలకు చెందిన 24 మందికి ఒంగోలుకు చెందిన 34వ ఆంధ్రా బెటాలిన్ కమాండింగ్ ఆఫీసర్ వి.మోహన్ ఆదేశాల మేరకు హవల్దార్ యువరాజ్ సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దొనకొండ జడ్పీ పాఠశాలకు 2023లో ఎన్‌సీసీ యూనిట్ తెప్పించి సమర్థవంతంగా మొదటి బ్యాచ్‌కు ఏ సర్టిఫికెట్ అందజేస్తున్నట్టు చెప్పారు. పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కె.నర్సింహారావు మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిఏడాది 50 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో ఎన్‌రోల్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

పీసీపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి గడువులోగా పనులు పూర్తిచేయాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. ఈనెల 21నుంచి జరగనున్న స్వామిత్వ గ్రామసభలకు సంబంధించి సోమవారం సమీక్ష చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాఖలవారీ ఉద్యోగులందరూ స్వామిత్వ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలన్నారు. గ్రామ సభల్లో ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలు, సూచనలు, సలహాలను స్వీకరించి నమోదు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూసమస్యను పరిష్కరించరూ..



భూసమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను వేడుకుంటున్న బాధితులు

తాళ్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తమ పిల్లల ఆరోగ్య సమస్యను బాగుచేయించుకొనేందుకు భూసమస్య అడ్డంకిగా మారిందని మండలంలోని మాధవారం గ్రామానికి చెందిన కొండిమెల వెంకట్రావు దంపతులు వాపోయారు. సోమవారం తహసీల్దార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇద్దరు కుమారులు కండరాల వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. ఈవ్యాధిని నయం చేయించేందుకు పొలం అమ్మకం పెట్టగా రికార్డులు తప్పుగా ఉన్నాయని చెబుతున్నారని తెలిపారు. అనేక మార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోవటం లేదన్నారు. ఎంతకూ భూసమస్య పరిస్కారం కాక పోవటంతో కండరాల వ్యాధితో బాధపడుతున్న ఇద్దరు కుమారులను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకవచ్చి తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. తహసీల్దార్ బీవీ రమణారావు వీల్‌చైర్‌లో వున్న ఇద్దరు అన్నదమ్ములను చూసి చలించిపోయారు. తప్పక భూసమస్యను పరిష్కరించి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పాడి రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ



దాణా పంపిణీచేస్తున్న జడ్పీటీసీ మారం, ఏడీఏ పురుషోత్తమరాజు

తాళ్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేస్తుందని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్‌ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక పశువైద్యశాల వద్ద సోమవారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మేతకు కొంత కొరత ఏర్పడిందన్నారు. ప్రజాప్రభుత్వం పాడి రైతాంగాన్ని ఆదుకునేందుకు సబ్సిడీపై దాణా అందజేస్తుందని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు.

దర్శి పశుసంవర్ధకశాఖ ఏడీఏ పురుషోత్తమరాజు మాట్లాడుతూ మండలంలోని పాడిరైతులకు ఐదు టన్నుల పశువుల దాణా విడుదలయిందన్నారు. దాణా 50 కెజీల బస్తా రూ.1110 ఉండగా, ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై రూ.550కు అందజేస్తుందని చెప్పారు. మండలంలో వంద బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైతే ఇంకా సరఫరా చేస్తామని చెప్పారు.

కార్యక్రమంలో పశువైద్యులు ప్రతాప్‌రెడ్డి, వంశీ, సర్పంచ్‌లు కాలేషావలి, సుమలతా శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మారం వెంకారెడ్డి, అనపర్తి సుబ్బారావు, వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సొంత నిధులతో చప్టా నిర్మాణం

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని ఎర్రచేలు ప్రాంతంలో వాటర్‌ట్యాంకు మూడవ లైను వరవకట్ట కాలువపై చప్టా నిర్మాణానికి ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలతో టీడీపీ నాయకుడు, వ్యాపారవేత్త షేక్ షంషూర్ సొంత నిధులు వెచ్చించి నిర్మించే చప్టా నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. గత కొంత కాలంగా కాలువపై చప్టా లేకపోవడంతో పలువురు వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా నిర్మాణానికి అవసరమైన నిధులు లేవని కాలయాపన చేస్తున్నారు.

ఈక్రమంలో స్థానిక ప్రజల ఇబ్బందుల నివారించడానికి వ్యాపారవేత్త షేక్ షంషూర్ నడుంబిగించి సొంత నిధులతో చప్టా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ హజీగౌస్, తెలుగుయువత అధ్యక్షుడు మెంటా నరసింహారావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజారహంతుల్లా, నాయబ్‌రసూల్, సలాం ఖాజా మొహిద్దీన్, ఖాజావలి, దిల్‌దార్, షకీబ్, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవస్థానంలో ప్రత్యేక పూజలు

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వామి భక్తులకు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి, కుమారులు వెంకటసాయి విష్ణువర్ధన్‌రెడ్డి, శివసాయికుమార్‌రెడ్డి, కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా దేవస్థానంలో చైర్మన్ కావిటి సుబ్బయ్య, గుత్తి రాజా, ఆలయ ప్రధాన అర్చకులు చిమట పట్టాభి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బి.జయరామిరెడ్డి, కొండా నరసింహులు, వరికూటి హనుమంతరావు, నాయబ్‌రసూల్, తోట రవి, రాచూరి సురేష్, పోశం నరశింహారావు, కంభాల రోశయ్య, ఉగూరి నరసింహారావుతో పాటు అయ్యప్ప, భవాని, శివ, అంజనేయ, వెంకటేశ్వర స్వామి భక్తులు పాల్గొన్నారు.


అద్దంకిలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు నారాయణ, రవికుమార్

అద్దంకి పట్టణాభివృద్ధికి పూర్తి సహకారం

- అమృత్ 2.0 ద్వారా రూ.111 కోట్లు మంజూరు
- మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- మంత్రి గొట్టిపాటితో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణ

అద్దంకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. సోమవారం పట్టణంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఆయన సుమారు రూ.12.40 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. అద్దంకి పట్టణానికి నిధులు కేటాయింపుపై ఏడాదిన్నర కాలంలో మంత్రి రవికుమార్ కనీసం వందసార్లు ప్రస్తావించారని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీటి సరఫరాకు.. రూ.111 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఊరచెరువు అభివృద్ధికి రూ.6 కోట్లు, మినీ బైపాస్‌కు రూ.15 కోట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వేసిన చెత్తను డంపింగ్ యార్డు నుంచి తొలగించి.. అద్దంకి మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచిందన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరతగతిన పూర్తిచేసి.. అన్ని మౌలిక వసతులతో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అద్దంకి పట్టణాభివృద్ధికి ఇప్పటికే మంత్రి నారాయణ రూ.7.50 కోట్లు మంజూరు చేశారని, మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రి రవికుమార్ కోరారు. మినీ బైపాస్ నిర్వాసితులైన 60 కుటుంబాలకు శింగరకొండ వద్ద మౌలిక వసతులు కల్పించి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందన్నారు. నామ్ రోడ్డులో ప్రమాదాలు పెరిగిన నేపథ్యంలో కాలువ కట్టను మినీ బైపాస్‌గా మార్చడం జరుగుతుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. రెండు విడతల్లో మినీ బైపాస్ నిర్మాణం పూర్తవుతుందన్నారు.

వేడుకగా ప్రారంభోత్సవాలు..

ముందుగా ద్వారకా నగర్‌లో రూ.4.5 కోట్లతో చేపట్టిన 33 కేవీ సబ్‌స్టేషన్, మొండితోకపాలెంలో రూ.7.50 కోట్ల నిధులకు సంబంధించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాలను మంత్రులు ఆవిష్కరించారు. పాత పసుమర్తిపాలెంలో కమ్యూనిటీ భవనం, ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. 230 మంది కళాశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. 60 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.50 లక్షల నగదు చెక్కును అందజేశారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, మెప్మా పీడీ సత్యానంద పాల్, విద్యుత్ ఎస్‌ఈ ఆంజనేయులు, ఈఈ మస్తాన్‌రావు, కమిషనర్ రవీంద్ర, నేతలు చిన్ని శ్రీనివాసరావు, చుండూరి మురళీసు ధాకరరావు, నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న మంత్రులు నారాయణ, రవికుమార్

నిర్ణీత కాల పరిమితిలో అర్జీలు పరిష్కరించాలి

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను చట్ట పరిధిలో.. నిర్ణీత కాల పరిమితిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ఎస్పీకి వివరించారు. ఎస్పీ సంబంధిత పోలీసు స్టేషన్ల హెచ్‌వోలతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. 63 మంది అర్జీదారులు సమస్యలను ఎస్పీకి వివరించారు. డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు, ఎస్‌ఐ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

పరిపూర్ణం.. భక్తిపారవశ్యం!


గుంటూరులో దీపారాధన చేస్తున్న మహిళ

కార్తిక మాసం చివరి సోమవారం శైవక్షేత్రాలు భక్త జన సంద్రంగా మారాయి. పవిత్ర మాసాంతం.. నియమ నిష్టలతో ఉన్న భక్తులు ఆలయాలకు భారీగా పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించి.. భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీప నైవేద్యం సమర్పించి.. ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం పఠిస్తూ.. మనసారా స్వామిని దర్శించుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి.. మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ప్రథమ ఆరామం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయానికి రాష్ట్ర నలుమూల నుంచి భారీ గా భక్తులు చేరుకున్నారు. కార్తిక దీపాల కాంతిలో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలకంరణ సేవ చేశారు.

- నరసరావుపేట, అమరావతి, పెదకాకాని


అమరావతి అమరేశ్వరాలయంలో కోటి దీపోత్సవం


ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు, అమరావతి అమరేశ్వరుడు




పెదకాకాని శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు


అమరావతి వద్ద కృష్ణానదిలో భక్తుల పుణ్య స్నానాలు


భక్తులతో కిక్కిరిసిన సూర్యలంక తీరం

వసతిపై.. వీడిన గ్రహణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఎట్టకేలకు వర్సిటీ పాలక మండలి సమావేశం
- రూ.19.60 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం
- పూర్తికానున్న ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు కాకినాడ జేఎన్‌టీయూలో పాలక మండలి సమావేశం జరిగింది. ఇందులో నరసరావుపేట కళాశాల అభివృద్ధిపై చర్చించారు. వీసీ సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. నిధుల కొరతతో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రూ.19.60 కోట్ల నిధులు విడుదలకు సమావేశంలో తీర్మానించినట్లు సమాచారం. నిధుల కొరతతో కాంట్రాక్టర్లు వసతి గృహాల నిర్మాణ పనులు నిలిపివేశారు. దీనిపై.. వీసీ హామీ హుళక్కి.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించి.. పాలకమండలి సమావేశం నిర్వహించి.. నిధుల కేటాయింపుపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నెల రోజుల్లో పనులు ప్రారంభం

పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో ఉన్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సూమారు 1,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి వసతి లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు తుది దశలో నిలిచిపోయాయి. దాదాపు ఏడాదిన్నరగా వర్సిటీ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వసతి గృహాల నిర్మాణానికి ఈసీ సమావేశంలో రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. బాలికల వసతి గృహం ప్రహరీకి రూ.1.10 కోట్లు, రహదారుల అభివృద్ధి, ప్రధాన గేటు ఏర్పాటు వంటి పనులకు రూ.8.50 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. దీంతో నెల రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. కళాశాల భవనంలో మరో ఫ్లోర్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు గతంలో రూ.31.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ నిర్వహించాల్సి ఉంది. రూ.16 కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులు చేపట్టగా ఇవి నత్తనడకన సాగు తున్నాయి. అలాగే కళాశాలలో అధ్యాపకుల కొరతపై చర్యలు చేపట్టనున్నారు. కాంట్రాక్ట్ విధానంలో అధ్యాపకులను నియ మించాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి వేగవంతం చేస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరుతాయి.




వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, ఉగ్ర నరసింహారెడ్డి

నల్ల బర్లీ రైతులను ఆదుకోవాలి

పర్చూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌తో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. సోమవారం సచివాలయంలో ఆయనను కలసి నల్లబర్లీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకు తాలూకా పెండింగ్ బకాయిని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల వద్ద పెద్ద ఎత్తున నిల్వ ఉన్న పొగాకు ఇటీవల వరదల కారణంగా తడిచిపోవడం, కొనుగోలులో జాప్యం కారణంగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని సెక్రటరీ దృష్టికి తెచ్చారు. రైతుల వద్ద మిగులు నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి సేకరించేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రక్రియలో పాల్గొన్న ఉద్యోగుల జీతాలు, గోడాముల అద్దె బకాయిల చెల్లింపులు చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భేటీ అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేసిందన్నారు. రైతు సంక్షేమమే ప్రజా కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఉన్నారు.

అధికారులంతా ఐడీ కార్డు ధరించాలి

ఇక పనిదినాల్లో విజిటింగ్ అవర్ ● కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ ఐడీ కార్డు ధరించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. దీంతో అధికారులను గుర్తించడానికి ప్రజలకు వీలవుతుందన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విచ్చేసిన అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పని దినాల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విజిటింగ్ అవర్ ఉంటుందన్నారు. ఈ సమయంలో ప్రజలు, అధికారులు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు. ఇలాగే ప్రతి కార్యాలయంలో విజిటింగ్ అవర్స్ నిర్వహించా లన్నారు. అధికారులంతా చిత్తశుద్ధితో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు బాపట్ల రెడ్‌క్రాస్, కలెక్టరేట్ ద్వారా ఉచితంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనం పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమన్నారు. భోజన పదార్థాలను పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడారు.


అర్జీదారులతో భోజన రుచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ

స్త్రీశిశు సంక్షేమశాఖ రూపొందించిన మిషన్ వాత్సల్య పథకం గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ పథకం కింద ఏటా నవంబరులో దత్తత మాసోత్సవాలు జరుగుతాయన్నారు. గతంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా దత్తత ప్రక్రియ నిర్వహిస్తుండగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) ద్వారా ఈ ప్రక్రియ సాగుతుందన్నారు. అనాథ శిశువులకు శిశుగృహంలో ఆశ్రయం కల్పించి.. వారి దత్తతను చట్టబద్ధంగా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో.. జేసీ భావన వశిష్ఠ, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఇక్కట్లు తీరేదెన్నడు?

తీరని చావలి పెద్ద కాల్వ డొంక దారి సమస్య



వేమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తుల రవాణాకు, సాగు భూముల్లోకి వెళ్లేందుకు ప్రధాన మార్గమైన చావలి పెద్ద కాల్వ డొంక అభివృద్ధికి అడుగులు పడడం లేదు. ఈ మార్గంలో ఆరు దశాబ్దాలుగా తాము పడుతున్న ఇబ్బందులను.. 250 ఎకరాలకు చెందిన రైతులు లిఖిత పూర్వకంగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి స్పందనా కనిపించడం లేదు. చావలి గ్రామ రైతు సోమరౌతు వెంకట సుబ్బారావు జనవరిలో మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించడంతో.. ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. దీంతో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ రైతు వెంకట సుబ్బారావును తన కార్యాలయానికి పిలిపించి డొంక సమస్యపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాలతో సమస్య పరిష్కారానికి ఈ నెల 7న సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేశారు. కార్యదర్శి శ్రీనివాసరెడ్డి కలెక్టర్ ఆదేశాలను గ్రామస్తులకు వివరించారు. చావలి పంచాయతీ పరిధిలో 1,083 మీటర్లు, పెరవలి పంచాయతీ పరిధిలో 2,474 మీటర్ల దూరం ఈ డొంక మార్గం ఉందని.. చావలి పంచాయతీ పరిధిలో మాత్రమే అభివృద్ధికి నిర్ణయం తీసుకోగలుతామని వివరించారు. దీంతో స్పందించిన రైతులు మూడు కిలోమీటర్ల డొంక మార్గం పూర్తిగా బాగు చేయాలని కోరారు. పెరవలి పంచాయతీలో కూడా డొంక అభివృద్ధికి కూడా.. సభ ద్వారా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ సూచనల మేరకు కార్యదర్శి సభ్యుల ఏకగ్రీవ తీర్మానం కలెక్టర్‌కు పంపారు. డొంక నిర్మాణానికి ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ.1.10 కోట్ల అంచనాతో ప్రతిపాదన చేశారు.

సీసీఐ పత్తిబంధకాలు

ఎన్ని విజ్ఞప్తులు చేసినా..

ఏపీలో పత్తి రైతులను ఆదుకునేందుకు.. తేమ శాతంలో మార్పులు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కేంద్రానికి లేఖ రాశారు. గత వారం గుంటూరు జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదు.



కొనుగోలు కేంద్రాల్లో పాస్‌కాని పత్తి

- సీసీఐ నిబంధనలతో బయ్యర్ల తిరస్కరణ
- బయట దళారులకు రూ.5 వేలకే విక్రయం
- వాతావరణ మార్పులతో రైతుకు తప్పని కంట'తడి'
- తేమశాతం పెంచితేనే.. కర్షకులకు ప్రయోజనం

పత్తి రైతులకు సాగు మొదలకుని.. కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయం వరకు కంటతడి తప్పడం లేదు. సాగు సమయంలో పంటపై ప్రకృతి పగబడితే.. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిబంధనలు మద్దతు ధర పొందడానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. తేమ శాతం అధికంగా ఉందని కొనుగులు కేంద్రాలకు వచ్చిన పత్తి పంటను బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో కేంద్రాలు ఆరంభించి అధికారికంగా పది రోజులు దాటినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టుమని పది కేజీల పత్తి కూడా కొన్న దాఖలాలు కనిపించడం లేదు. సీసీఐ నిబంధనల మూలాన రైతులు కేంద్రాలకు తెస్తున్న పత్తి పాస్ అవ్వడం లేదు.

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి తీత జోరుగా సాగుతోంది. మొన్నటి దాకా తుఫాన్ ప్రభావంతో పత్తిలో నెమ్ము ఎక్కువగా కనిపించింది. ఇప్పుడు వాతావరణం పూర్తిగా మారిపోయి పగటి వేళ కూడా చల్ల గాలులు వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో రైతులు హడావిడిగా పత్తి తీయిస్తున్నా.. పంటలో తేమ శాతం 18 నుంచి 22 వరకు ఉన్నట్లు తేలుతోంది. సీసీఐ నిబంధనలు ప్రకారం తేమ శాతం 8 నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి.

దళారుల పంట పండుతోంది..

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దే దళారుల పంట పండుతోంది. కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం చూసిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

పెట్టుబడులకు గమ్యస్థానం ఏపీ : సలగల

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారన్న దానికి నిరూపనగా సీఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారన్నారు. 613 ఒప్పందాల ద్వారా రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు, 16,13,188 ఉద్యోగాలు రావడం రాష్ట్ర అభివృద్ధిపై పెట్టుబడుదారుల నమ్మకానికి సాక్ష్యమన్నారు.

ఎయిడెడ్ టీచర్ల వివరాలు కోరిన డీఈవో

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేసేందుకు అడుగు ముందుకు పడింది. ఎప్పటినుంచో హెల్త్ కార్డులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఎయిడెడ్ టీచర్ల వివరాలను ప్రభుత్వం కోరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వారి వివరాలను డీఈవో కిరణ్‌కుమార్ కోరినట్లు ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయి ఐడీ, సీఎఫ్ఎంఎస్, టీచర్ ఇంటి పేరు, పాఠశాల పేరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలను డీఈవో కోరారు. నితర వివరాలను గూగుల్ షీట్‌లో వెంటనే డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ చెప్పారు. సంతనూతలపాడు మండలం మైనంపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం పోక్సో యాక్ట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు సాధ్యమైనంత వరకు సమీప బంధువుల ద్వారానో, తెలిసిన వారి ద్వారా జరుగుతాయని అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ద్వారా జీతం పొందేవారు పోక్స్ నేరాలలో పాల్గొన్నట్లు తేలితే 20 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువైన శిక్షలు పడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా కలెక్టర్‌కు అవార్డు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాటర్‌షెడ్ పథకంలో పీసీపల్లి మండలం మురుగమ్మి గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో లభించిన అవార్డును మంగళవారం కలెక్టర్ రాజాబాబు అందుకోనున్నారు. ఢిల్లీలో మంగళవారం జరగనున్న కార్యక్రమం నేపథ్యంలో సోమవారం కలెక్టర్ బయలు దేరివెళ్లారు. కలెక్టర్‌తో పాటు డ్వామా వాటర్‌షెడ్ ఏపీడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

వ్యభిచార గృహంపై దాడి చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : వ్యభిచార గృహంపై దాడి చేసి ముగ్గురు నిర్వాహకులతోపాటు ఒక విటుడు, ఒక స్త్రీని అదుపులోకి తీసుకున్నట్లు ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలో ఇరువురు మహిళలు, ఒక పురుషుడు కలిసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

భర్త కాపురానికి తీసుకెళ్ల లేదని భార్య ఆందోళన

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కోర్టు ఆదేశించినా తన భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ వివాహిత సోమవారం స్థానిక రాజీవ్‌నగర్‌లో ఎన్‌బీకే రెసిడెన్సీలో ఆందోళనకు దిగింది. వివరాలలోకి వెళితే... తన భర్త 20 ఏళ్ల కిందట వివాహం చేసుకొని పిల్లలు పుట్టిన తరువాత ఇంటి నుంచి గెంటివేశాడని బాధితురాలు వాపోతుంది. అదే క్రమంలో తన భర్త చెడు వ్యసనాలకు బానిసై విడాకులకు కోర్టును ఆశ్రయించాడని, కోర్టు.. భార్యాభర్తలు కలిసి కాపురం చేయాలని ఆదేశించింది. మూడునెలలు గడుస్తున్నా తన బిడ్డలను చూపించకుండా కాపురానికి తీసుకెళ్లకుండా మానసిక క్షోభ పెడుతున్నారని ఆందోళనకు దిగారు. ఈమేరకు తాలూకా పోలీసులు బాధితురాలును పిలిచి విచారణ చేపట్టారు.

పి.నాయుడుపాలెంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు వినతి

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పి.నాయుడుపాలెంలో వలసదారుల కుటుంబంలో పిల్లల కోసం సీజనల్ హాస్టల్ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి మంజూరు చేసినట్లు ఎంఈవో నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీనుంచి 44 మంది విద్యార్థులకు హాస్టల్‌లో సౌకర్యం ఉంటుందని తెలిపారు. నిర్వహణకు ఆసక్తి కల్గిన ఎన్‌జీఓలు, ఎస్‌హెచ్‌జీల నుంచి ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9505032613నంబరులో సంప్రదించాలని కోరారు.

చీమకుర్తిలో వైభవంగా కోటి దీపోత్సవం

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలో సాక్షిరామ లింగేశ్వరాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. పరమశివుని చిత్రం చుట్టూ చేసిన దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. మండల పరిధిలోని అన్ని శివాలయాల్లో చివరి కార్తీక సోమవారం నాడు విశేషంగా పూజలు జరిపారు.



సాక్షిరామలింగేశ్వరాలయంలో కోటి దీపోత్సవంలో భక్తులు

మద్దిపాడులో...

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవార పూజలు ఘనంగా జరిగాయి. ప్రధాన అర్చకుడు గంగాధర్ రావు పంతులు ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అరి సురేంద్రబాబు, నరసింహారావులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

సుదర్శన యజ్ఞంతో లోక కల్యాణం

ఒంగోలు నగరంలో తాళ్లపాక హరి నారాయణాచార్యులు పర్యటన

ఒంగోలు కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులకు(12వ తరం) చెందిన తాళ్లపాక హరినారాయణాచార్యులు సతీసమేతంగా సోమవారం సాయంత్రం ఒంగోలు నగరంలో పర్యటించారు. వారు గడియారం వారి వీధిలోని బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలోని శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్య శర్మ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి పూజా కార్యక్రమంలో హరినారాయణాచార్యులు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాముడు రాఘవుడు అనే అన్నమాచార్య కీర్తనను ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కోదండరామ స్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీనారసింహ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించటం ఎంతో ఆనందదాయకమని, ఇది లోకకల్యాణానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం హరినారాయణాచార్యులును ఘడియారం సుబ్బయ్య శర్మ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి కార్యదర్శి మహంకాళి వెంకటశేషయ్య, కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులు మైనంపాటి సాయికుమార్, భక్తులు పాల్గొన్నారు.


హరినారాయణాచార్యులను సన్మానిస్తున్న దేవస్థాన నిర్వాహకులు

‘జడా’కు ఘన నివాళి

నాటి స్మృతులను గుర్తు చేసుకున్న పీఎస్ఎఫ్ శ్రేణులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్ ఫ్రంట్ (పీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత జడా కోటేశ్వరరావు 14వ వర్ధంతిని ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. పీఎస్ఎఫ్ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రంగా భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఫ్రంట్ సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ శ్రేణులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, జడా అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, నిబద్ధత, విద్యార్థుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా స్థాపించిన పీఎస్ఎఫ్ స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. ఒంగోలు శర్మాకాలేజీలో స్టూడెంట్ ఫ్రంట్ ఏర్పాటుతో జడా కోటేశ్వరరావు ప్రతి ఒక్కరి గుండెలో నిలిచిపోయారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎందరో విద్యార్థులకు ఒంగోలులో వసతి కల్పించడంతోపాటు, అండగా నిలవడం, అలాగే వారి సమస్యలు పరిష్కరించడంలో బలమైన స్టూడెంట్ సంఘంగా పీఎస్ఎఫ్ ఎదిగిందని చెప్పారు. ఆయనను స్మరించుకోవడం ద్వారా చాలాఏళ్ల తర్వాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని, కాలేజీలో గడిపిన మధురస్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరిబాబు, బాచిన చెంచుగరటయ్య, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాజీ చైర్మన్ ఈదర మోహన్, సీనియర్ నాయకులు నల్లూరి కిషోర్, వైవీ సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, గేనం సుబ్బారావు, వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి, కొత్తపట్నం జడ్పీటీసీ సభ్యుడు లంకపోతు అంజిరెడ్డి, ఈదర చిన్నారి, సుల్తాన్ బేగ్ (మస్తాన్), వై.శీనయ్య, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, చలపతి, బచ్చు వీరాంజనేయులు, జడా కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు.


జడాకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ఈదర, బాచిన, డాక్టర్ సీతారామయ్య

సదస్సు మొదలు కాకముందే పెట్టుబడుల వరద

టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో జరిగిన సీఐఐ గ్లోబల్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్ దిశను పూర్తిగా మార్చే చరిత్రాత్మక వేదికగా నిలిచిందని, సదస్సు మొదలు కాకముందే పెట్టుబడి వరద మొదలైందని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెట్టుబడుల ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయన్నారు. 613 ఒప్పందాలు, రూ.13.25,716 కోట్లు పెట్టుబడులు రాకతో 16,13,188 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సదస్సుకు ముందు రోజు ప్రభుత్వం 35 ప్రతిష్టాత్మక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమన్యాయం జరిగిందని నూకసాని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ఆగే ప్రసక్తే లేదని చెప్పారు.


మాట్లాడుతున్న నూకసాని

కాజేసిన పొదుపు సంఘాల నిధులు రాబట్టాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మహిళలు

ఒంగోలు రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరంపాడుహరిజనవాడ గ్రామపంచాయతీలో నొక్కేసిన స్వయం సహాయక సంఘాల నిధులు రాబట్టాలని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు పొదుపు మహిళలు అర్జీ సమర్పించారు. ఆ సందర్భంగా స్వయంసహాయక సంఘాల మహిళలు మాట్లాడుతూ నిధులు స్వయం సహాయక సంఘాల నిధులు సుమారు రూ.50లక్షలు ఉండాల్సి ఉంది.. ప్రస్తుతం రూ.5వేలు మాత్రమే ఉన్నాయన్నారు. ఆ నిధులు నొక్కేయటంలో అప్పటి ఏపీఎం గోపి, సీసీ సాంబయ్యల సహకారంతో కీపర్ దర్శి సుజాతతో కుమ్మక్కై నిధులు దోచుకున్నట్లు తెలిపారు. ఆ నిధులను రాబట్టి స్వయం సహాయక సంఘాల మహిళలు న్యాయం చేయాలని సుజాత, రత్తమ్మ కోరారు.

కుష్ఠు నివారణపై అవగాహన

పొన్నలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నివారణపై స్థానిక సచివాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన మాట్లాడుతూ కుష్ఠును సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు సర్వే కొనసాగుతున్నదని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్ రవికిరణ్, వైద్య సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహించిన వైద్య అధికారులు, సిబ్బంది

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ కేవీపీ రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మంగమూరు రోడ్డులోని సుబ్బయ్యనగర్, ఎస్ఎస్‌పీ కాలువ, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్, గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్, చంద్రయ్య నగర్, సరస్వతి శిశుమందిర్, ఎన్‌జీవో కాలనీ 7వలైన్‌లలో విద్యుత్తు అతరాయం ఏర్పడుతుందని అన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన

కొండపి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, చాణక్య జూనియర్ కళాశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మర్రిబోయిన శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. అక్కడ వసతులను చూశారు. ప్రభుత్వ హైస్కూల్‌లో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆయన ఎంఈవో పి.రామారావుకు సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం సుబ్బారావు, అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ఎంఐఎస్‌వో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైలు నుంచి జారిపడి సుమిత్ మిగ్గ్ (35) మృతి చెందిన ఘటన మండలంలోని గజ్జలకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ఏఎస్ఐ వెంగళరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రం జల్పైగురి జిల్లా బీర్‌పూర్ ప్రాంతానికి చెందిన సుమిత్ మిగ్గ్ మాల్దా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కాడు. సహచరులతో కలసి వెల్డింగ్ పనులు చేసుకునేందుకు వాస్కోడిగామా రైలులో బెంగళూరుకు వెళుతున్నాడు. గజ్జలకొండ రైల్వేస్టేషన్ ప్రాంతంలో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించి కేసు న మోదు చేశారు.శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఆర్థిక మోసాలపై మూడు కేసులు

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్థిక మోసాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మూడు కేసులు నమోదయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కాలేజీ రోడ్డులోని బజాజ్ ఆటో ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న తర్లుపాడు మండలం బుడ్డపల్లె గ్రామానికి చెందిన దేవెండ్ల శ్రీను రూ.6 లక్షల మేర ఈఎంఐలు వసూలు చేసుకుని కంపెనీకి కట్టలేదు. ఈ విషయమై మేనేజర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఎన్నిసార్లు డబ్బులు చెల్లించాలని అడిగినా శ్రీను స్పందించలేదు. దీంతో టౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

- ప్రైవేటు చీటీ పాడుకున్న తనకు నిర్వాహకుడు రూ.3.80లక్షల మేర డబ్బులు ఇవ్వడంలేదని పట్టణానికి చెందిన సింగరి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జక్కా శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.
- స్థానిక శ్రీనివాస థియేటర్ వద్ద ఇంటి సమీపంలో నివసించే పాలకేంద్రం నిర్వాహకుడు జంకె కోటిరెడ్డి ఇబ్బందుల్లో ఉండడంతో అవసరానికి ఎవరికీ తెలియకుండా ఇంట్లోని 10 తులాల బంగారం, రూ.లక్ష నగదు ఇస్తే తనకు తిరిగి చెల్లించలేదని దేవెండ్ల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

రూ.1.35 లక్షలు స్వాధీనం

గిద్దలూరు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ జూదరులు పోలీసులకు చిక్కారు. అర్బన్ సీఐ కె.సురేష్ కథనం ప్రకారం... ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.1.35 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3 లక్షలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.3,17,314 వచ్చినట్లు దేవస్థాన చైర్మన్ చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,02,706, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.76,340, శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం వచ్చినట్టు తెలిపారు. పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు పార్వతి దంపతుల కుమారుడు వెంకట కిశోర్‌బాబు, మానస దంపతులు, శాశ్వత అన్నదాన పథకానికి రూ.40 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు.

అవీఇవీ

గ్రామీణాభివృద్ధికి సొసైటీలు పట్టుగొమ్మలు


ప్రతిజ్ఞ చేస్తున్న ఎండీ వేణు, సభ్యులు

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సొసైటీ) గ్రామీణాభివృద్ధికి పట్టుగొమ్మలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) మేనేజింగ్ డైరెక్టర్ డి. వేణు తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను సోమవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా సహకార పతాకాన్ని ఎండీ ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. జోనల్ సహకార విద్యాధికారి జి. శ్రీనివాసరావు, ఒంగోలు సూపర్‌బజారు ఎండీ సురేంద్రకుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీబీఎస్ కుమార్, మారుతి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వైసీపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు కార్యాలయ సిబ్బందిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ భవన్ నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ పర్యటన నేపథ్యంలో ఈ ఘటన జరగడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దుంపా రవణమ్మ, పాలడుగు రాజీవ్, భూమిరెడ్డి రవణమ్మ, లంకపోతు అంజిరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి, క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, వడ్లమూడి వాణి, పేరం ప్రసన్న, కరుణాకర్, వేముల శ్రీకాంత్, ముల్లంగి రవీంద్రారెడ్డి, పల్నాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహ, పట్టణ పథకాలపై చర్చించిన మాగుంట


మాట్లాడుతున్న చైర్మన్, ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలో కొచ్చిన్‌లో సోమవారం జరిగిన గృహ- పట్టణ పథకాలపై సోమవారం గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంట్ కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమీక్షించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రగృహ- పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆర్థికశాఖ, కొచ్చిన్ స్మార్ట్‌మిషన్‌లిమిటెడ్, గ్రేటర్ కొచ్చిన్ అభివృద్ధి అథారిటీ, కొచ్చిన్ మునిసిపల్ కార్పొరేషన్, కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్, స్టేట్ బ్యాంకు, కెనరా బ్యాంకు, హడ్కో తదితర సంస్థల ప్రతినిధులతో చర్చించి పలు ఆదేశాలు జారీ చేశారు. భారత్‌మిషన్- అర్బన్, అమృత్, పీఎం ఆవాస్ యోజన, పీఎంఎస్‌వీఏ నిధి తదితర పథకాలపై చర్చించి అధికారులకు మాగుంట సూచనలు ఇచ్చారు.

మా భూమి మాకు ఇప్పించండి

పీజీఆర్ఎస్‌లో బల్లికురవ రైతుల విజ్ఞప్తి

బాపట్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బల్లికురవ గ్రామానికి చెందిన రాఘవులు, వీరరాఘవులు, పూర్ణయ్య, సుబ్బారావులకు సంబంధించిన 69సెంట్ల భూమిని అక్రమించిన వారి పేరిట ఆన్‌లైన్ చేసి ఇబ్బంది పెడుతున్నారంటూ సోమవారం పీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ సింగారావు తమ భూమిని జొన్నలగడ్డ మేరమ్మ పేరిట 1బీలో నమోదు చేశారన్నారు. తమ గ్రామానికి చెందిన నాగబోయిన సింగారావు, శ్రీనివాసరావుల మద్దతుతో ఈవిధంగా చేసి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదన్నారు. తమ పూర్వీకులు నుంచి తమకు వచ్చిన భూమిని ఇప్పించి రక్షణ కల్పించాలని దీనికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


భూమి అక్రమించారంటూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

‘మీకోసం’లో రెండు అర్జీలు

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మద్దిపాడు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సోమవారం రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రెండు అర్జీలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వెంటనే భూమికి కొలతలు వేయాలని ఆమె సర్వేయర్లకు సూచించారు.

సీసీఐ పత్తిబంధకాలు!

(5వ పేజీ తరువాయి)

బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో బయట అదే పత్తిని దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంటను వెనక్కి తీసుకెళ్తే.. రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని భావించిన రైతులు.. అయినకాడికి పత్తిని అక్కడే తెగ నమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్వింటాల్ పత్తి రూ.5 వేలకు అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అదే పత్తి సీసీఐ కొనుగోలు చేస్తే రైతుకు క్వింటాల్ కు రూ.రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత) లభిస్తుంది. దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర దక్కేది.

జీవోను అమలు చేయడం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 843 ను సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్ సీఎండీకి లేఖ రాశారు. జీవోలోని 23వ నిబంధన ప్రకారం రైతుల పత్తి పంటను ఇష్టం అయిన చోట అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఐ మాత్రం తాము చెప్పిన చోటే అమ్ముకోవాలని చెబుతోంది. దీనిపై ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు సీసీఐ మేనేజర్‌ను కలిసి రైతుల సౌలభ్యం కోసం జీవోను అమలు చేయాలని కోరినా.. పెద్దగా స్పందించకపోవడంతో తో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

బాబోయ్.. దోమలు

● దండుబాట రోడ్డులో అధ్వానంగా పారిశుధ్యం ● పందులు, దోమలు, విషసర్పాలకు ఆవాసాలు ● కన్నెత్తి చూడని అధికారులు


ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ పరిధిలోని దండుబాట రోడ్డులో వ్యర్థ జలాలు, మురుగు నిల్వలతో ప్రజలు విలవిల్లాడు తున్నారు. జనావాసాల్లో మురుగు నీరు చేరి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు పేట్రేగిపోతున్నాయి. దీంతో దోమలు అవాసాలు ఏర్పాటు చేసుకుని చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే డెంగ్యూ బారినపడి పలువురు రోధిస్తున్నారు. అయితే మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్యం సక్రమంగా లేదని, చెత్తసేకరణ అంతంత మాత్రంగానే ఉందని ఆరోపిస్తున్నారు.

ఇళ్లచుట్టూ మురుగు నీటితో అవస్థలు



మా ఏరియాలో ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి చాలా ఇబ్బందులు పడుతున్నాము. దోమలు విజృంభిస్తు న్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇటువైపు రావడం లేదు. మా పరిస్థితి పట్టించుకున్న నాధుడు లేడు

కట్టా వెంకటేశ్వర్లు, స్థానికుడు

రోగాలు ప్రబలుతున్నాయి



మురుగుతో అవస్థలు పడుతున్నాము. చిల్లచెట్లతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. అధికారులు పారిశుధ్య పనులు చేపట్టాలి. నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ చేయాలి. ఇక కాలనీలో కొంత కాలంగా అధికశాతం మంది డెంగ్యూ బారిన పడ్డారు. అధికారులు మా సమస్యలు పరిష్కరించాలి.

- కుంభా వెంకాయమ్మ, స్థానికురాలు

అవీ..ఇవీ..

ధనవృద్ధిపై కళాజాతతో అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ఇంకొల్లు, నవంబరు 17, (ఆంధ్ర జ్యోతి) : జిల్లా సహ కార కేంద్ర బ్యాంకు ఇంకొల్లు బ్రాంచ్ కొణి కి సొసైటీ వారి ఆధ్వర్యంలో ధనవృద్ధి డిపాజిట్ పథకం బంగారంపై రుణాలు, రైతులకు వ్యవసాయ రుణాలు పొందడంపై యడవల్లి చిరంజీవి కళాబృందం కొణికి చుట్టుపక్కల గ్రామాలలో సోమ వారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. రుణాలు పొందడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సహకార కేంద్రబ్యాంకు మేనేజరు వి.విజయకుమారి, సూపర్‌వైజర్లు సీహెచ్ వెంకటేశ్వర్లు, సుభాని, సీఈవో మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత

సంతమాగులూరు : టెక్నాలజీ పెరిగే కొద్దీ నేరాలు కూడా పెరుగుతున్నా యని వాటి పట్ల పూర్తిగా అప్రమత్తతో వ్యవహరించాలని సంతమాగులూరు సొసైటీ బ్యాంకు మేనేజర్ ఉమా అన్నారు. సోమవారం మండలంలోని కొమ్మాలపాడు సొసైటీ పరిధిలోని మక్కెన వారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సైబర్ నేరాలపై లోన్ యాప్ ద్వారా కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. పిల్లల తల్లిదండ్రులకు బ్యాంకు ఖాతాల యొక్క ఉపయోగాలు, పొదుపు రుణాలు, డిపాజిట్లు వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. వి రాజారామ్ కళాజాత బృందం వారి ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఏడుకొండలు నాయక్, సొసైటీ అధ్యక్షుడు కోయ నరసింహారావు, సీఈవో సునీల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాశీ సైదులు, కోయ శివకోటి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

30న చినగంజాంలో బైబిల్ పరీక్ష

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్ పెద్ద చర్చి వద్ద క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 30న ఆదివారం మధ్యాహ్నం 2.30గంటలకు బైబిల్ పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బ్రదర్ మేకల మేషక్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల స్థాయిలో బైబిల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే వారు 30వ తేది లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలైన ఐదుగురికి క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9849714691 నంబరను సంప్రదించాలన్నారు.

నిర్ణీత వ్యవధిలో సమస్యల పరిష్కారం

● తహసీల్దార్ సింగారావు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనన ధృవీకరణ పత్రాల కోసం ఇద్దరు, భూమి కొలతకు సంబందించి ముగ్గురు నుంచి ధరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రతి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పీఆర్, విద్యుత్ ఏఈలు హనుమంతరావు, ఆంజనేయులు, ఎంఈవో వీరాంజనేయులు, ఏపీవో సంతోషం, హెచ్‌వీ భానుమతి, పలు శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


పేదలకు దుప్పట్లు అందిస్తున్న దాతలు

ఇంకొల్లు, నవంబరు 17,(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా నిరాశ్రయులైన పేదలకు దాతల సహకారం తో దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 20 మంది పేదలకు దుప్పట్లు అందజేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం 25 మంది పేదలకు అన్నదానం నిర్వహిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు.

వైపి కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లకు ఆహ్వానం

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైపి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీలకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఎన్.మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియ సోమవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు కళాశాలలో నిర్వహణ విభాగాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎల్‌వోసీ మంజూరు

మార్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి):మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన వెలగా అంజమ్మ అనే మహిళకు అత్యవసర వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.40లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరైంది. ఈ మేరకు సోమవారం సెక్రటరియేట్ వద్ద అంజమ్మ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీని ఏలూరి సాంబశివరావు అందచేశారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తించేందుకు సర్వే

మార్టూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధిగ్రస్థులను గుర్తించడం, వారికి సకాలంలో వైద్యం అందించడం, వ్యాధిపై అవగాహన కలిగించడంపై సోమవారం పట్టణంలోని రామ్‌నగర్‌లో వైద్యాధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ కాలనీలోని ఇంటింటికి తిరిగి వ్యాధిగ్రస్తులైనవారు ఎవరైనా ఉన్నారా...? అంటూ విచారించారు. ఈ సందర్భంగా సర్వేకు డీఎస్ఎంవో డాక్టరు మహమ్మద్ సాదిక్, డీపీఎం శ్రీనివాసరావు, ల్యాబ్ సూపర్ వైజరు వెంకటరత్నం, హెచ్ఈవో ఆవుల వెంకటేశ్వరరెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు నర్సరావుపేట మండలం ఉప్పలపాడు, 10 గంటలకు అద్దంకి పట్టణంలోని 8వ వార్డు, 10-30 గంటలకు కాకానిపాలెం, 11 గంటలకు ముప్పవరంలోని పీఎస్ఎన్‌సీసీ హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఘనంగా హనుమాన్ సాయి మందిర వార్షికోత్సవం


స్వామివారికి పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కబొక్కలపాడులో ఉన్న హనుమాన్‌సాయి మందిర 19వ వార్షికోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయిమందిరంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక హారతులు, అభిషేకాలను ఏర్పాటు చేశారు. అర్చక స్వామి ఇంకొల్లు మధు, సుధీర్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో పాటు బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, నాగరాజుపల్లి, మల్లాయపాలెం గ్రామాల నుంచి భక్తులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని సాయి బాబాను, అంజనేయస్వామిని దర్శించుకొన్నారు. కార్తీకమాసం కావడంతో మహిళ భక్తులు దేవాలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు సమష్టి కృషితో దాతల సహకారంతో సుమారు రూ. 3 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి రవికుమార్ ప్రత్యేక పూజలు

నక్కబొక్కలపాడు హనుమాన్‌సాయి మందిరంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిపై విశ్వాసంతో పలుమార్లు ఈ దేవాలయంలో సాయి బాబాను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు దేవాలయ కమిటీ సాదర స్వాగతం పలికింది. ప్రతి ఒక్కరు దైవ మార్గంలో ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతరావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, నేతలు మలినేని గోవిందరావు, శంకర్, మాలపాటి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● ఎంపీడీవో రాజేష్‌బాబు


దివ్యాంగ సంఘ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేష్

వేటపాలెం(చీరాల), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : వేటపాలెం మండల పరిధిలో దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీవో రాజేష్ బాబు తెలిపారు. సోమవారం కార్యాలయంలో 'నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి' రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు విచ్చేసే దివ్యాంగులకు ఏర్పాటు చేయాల్సిన అంశాలపై చర్చించారు. కార్యాలయాల వద్ద ర్యాంపులు. తాగునీరు ఇతర వసతుల గురించి మాట్లాడారు. అలాగే మండలంలో అన్ని కార్యాలయాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సెక్రటరీ చక్రవర్తి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో అక్రమ కట్టడం అడ్డగింత

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ హెచ్చరించారు. ఈక్రమంలోనే సోమవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు సర్వే నెంబర్ 348, 349లో అనధికారంగా రెండవ అంతస్తులో పెంట్‌హౌస్ నిర్మాణం జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే సిబ్బంది సహాయంతో వాటిని నిర్మాణాలను తొలగించారు. బీపీఎస్ నిబంధనలను ధిక్కరిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

గ్రంథాలయంతో ఊరికి విజ్ఞాన వెలుగు


కవి సమ్మేళనంలో పాల్గొన్న సాహితి అభిమానులు

అద్దంకిటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఊరికి వెలుగునిచ్చేదీ, చరిత్ర తెలియజేసేదీ గ్రంథాలయం అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. 58 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నాల్గవ రోజు సోమవారం అద్దంకి శాఖ గ్రంథాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మరో గ్రంథాలయ ఉద్యమం అద్దంకి శాఖ సౌజన్యంతో సృజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గాదేపల్లి దతివాకర్ దత్తు నిర్వహణలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ జ్ఞానదీపం వెలిగించే అమ్మే గ్రంథాలయం, మన దేవాలయం అన్నారు. పుస్తకపఠన అభిరుచి లక్ష్య సాధనకు ఏకైక ఆయుధమని నారాయణం బాల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ సందర్భంగా జన సాహితీ ప్రచురించిన 'కార్యసురుడు-కార్యదక్షుడు', మంచికంటి వెంకటేశ్వరరెడ్డి రచించిన 'సమాజానికి బహిరంగలేఖ' పుస్తకాలను కార్యక్రమానికి హాజరైన వారికి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మన్నం త్రిమూర్తులు గ్రంథాలయ శాఖ అధికారి సీహెచ్ వసుంధరదేవి, అన్నమనేని వెంకట్రావు, చుండూరు సుగుణరావు, వారణాసి రఘురామశర్మ, పట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శ్రీమన్నారాయణ, బాబురావు, భువనేశ్వరి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

చీరాల : చీరాలశాఖ గ్రంథాలయ వారోత్స వాల్లో భాగంగా సోమవారం కవిసమ్మేళనం నిర్వహించారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ బత్తుల బ్రహ్మరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవులు వివిధ అంశాలపై కవిత లను వినిపించి అందరినీ అలరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, బీరం సుందరరావు, ఎల్ వెంకట్రావు, హేమ సుందరరావు, ఖాసీం, రూపాదేవీ, ద్రాక్షాయణి, కృష్ణచైతన్య, సుబ్బారావు, ఏకాంబరేశ్వర బాబు, పాల్గొన్నారు.


చీరాలలో కవులను సత్కరిస్తున్న ప్రతినిధులు

చినగంజాం : చినగంజాం శాఖ గ్రంథాల యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాల సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం సోమ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు మోహనలక్ష్మినరసింహాచార్యులు అధ్యక్షతన జరిగిన కవి సమేళ్ళనంలో ఎంఈవో బి.అజయ్‌బాబు మాట్లాడుతూ ఏ భాషలోని సాహిత్యమైన సమాజాన్ని ప్రతిబింబిస్తోం దని అన్నారు. సమాజ పురోగతికి ఉపయోగపడేదే నిజమైన సాహిత్యమని అన్నారు. రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, కవి, వీరేశ్వరశాస్త్రీ, అడవీదిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యులు, యువకవి చుండూరి వెంకట్‌లు తెలుగు గొప్పతనాన్ని తెలిపే సాహిత్యం గురించి వివరించారు. అనంతరం గ్రంథపా లకులు, పాఠకులు ఎంఈవో, కవులను ఘనంగా సన్మానించారు. వెంకట్ పలు సాహిత్య పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు, ఆంధ్రబ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు, బీడీసీఎల్ నిర్వాహకులు, పాఠకులు పాల్గొన్నారు.

వెండికిరీటం అందజేత


వెండి కిరీటం అందజేస్తున్న మేడికొండ మోహనరావు దంపతులు

అద్దంకి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి ఒంగోలుకు చెందిన చెందిన మేడికొండ మోహనరావు, రమాదేవి దంపతులు 1.250 కిలోల వెండి కిరీటాన్ని సోమ వారం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేశారు. అద్దంకి పట్టణంలోని దామా వారిపాలేనికి చెందిన భక్తుడు రూ.21 వేల విలువైన మోటార్‌ను అందజే శారు. శానంపూడికి చెందిన పలుకూరి వెంకటాచారి రాతి ముఖ మండపానికి రూ.20 వేలను అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను ఆశీర్వదించి, సత్కరించారు.

తల్లిదండ్రులు వేరే పెళ్లిలు చేసుకున్నారని...

● మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం
● చికిత్సపొందుతూ మృతి

అద్దంకి,నవంబరు17(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మనస్పర్థలతో వేరే వివాహాలు చేసుకోవడంతో మనస్థాపంతో ఎలుకల మందు తిన్న యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని గాజులపాలేనికి చెందిన తిప్పాబత్తిన శేషాద్రి (21) నర్సరావుపేటలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే ఆయన తల్లిదండ్రులు విడిపోయి వేరే వివాహాలు చేసుకున్నారు. దీంతో శేషాద్రి తాత సుబ్బారావు వద్ద ఉంటున్నాడు. మనస్థాపంతో ఈ నెల 11న ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి ఒంగోలు వైద్యశాలలో, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తాత సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రఫీ

అద్దంకిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంరక్షణ చట్టం గురించి కుటుంబ సభ్యులు అందరు అవగాహన కలిగి వారిని గౌరవంగా చూసుకోవాలని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ షేక్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం బస్టాండ్ ఆవరణంలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ సమాజంలో వృద్ధుల సంరక్షణ, వారిని గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యుల మీద ఉన్నదన్నారు. వారి హక్కులకు భంగం కలిగినప్పుడు వారు ఈ చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంతంగి ధనుంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముప్పవరంలో కార్తీక వనభోజన మహోత్సవం


భోజనాలు చేస్తున్న గ్రామస్థులు

పంగులూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో సోమవారం రాత్రి కార్తీక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం స్థానిక శివాలయంలో కార్తీకదీపోత్సవం నిర్వహించారు. స్వామివారికి భక్తులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రివేళ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



చినగంజాంలోని రామలింగేశ్వరస్వామి, పర్చూరులో పూజలు చేస్తున్న మహిళలు

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి.. కార్తీక మాసం ఆఖరి సోమవారం పరమశివుని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం,లో భక్తులు సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహించారు. మండలంలోని చినగంజాం గంగాపార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుని భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.


అద్దంకి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పర్చూరు : కార్తీక మాసంలో చివరి సోమ వారం సందర్భంగా ఆయా శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వేకువజామునే మహిళలు ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పర్చూరు మండలంలోని చెరుకూరు, ఉప్పుటూరు, పర్చూరు, నూతలపాడు, తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అద్దంకి : కార్తీక మాసం చివరి సోమ వారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయాలలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాల గుడి, కమలేశ్వరాలయం, మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. శింగరకొండలోని కోదండరామస్వామి దేవాలయం వద్ద సోమవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మాణిక్యరావు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూర్ఛ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, వారిలో చైతన్యం పెంచాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు చెప్పారు. ప్రపంచ మూర్ఛ వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూర్ఛ వ్యాధికి గురైన వారు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూర్ఛ వ్యాధి వచ్చినపుడు వారి చేతిలో తాళాలు పెట్టకుండా బాధితుల నాలుక కొరుక్కోకుండా నోటిలో ఏదైనా గట్టి వస్తువు పెట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డాక్టర్లు నటరాజ్, ఎస్.హరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు, ప్రభాకర్, సీఎస్ఆర్ఎంవో మాధవీలత పాల్గొన్నారు.



పొగాకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

కలిగిరి (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని పొగాకు బోర్డు ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎస్ రామారావు సూచించారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం పంటల మార్పిడిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 2025-26 పంటకాలానికి ఎఫ్‌సీవీ పొగాకు సాగు విస్తీర్ణం కొంతమేర తగ్గించుకొని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి, డీసీపల్లి పొగాకు బోర్డు సంయుక్త వేలం నిర్వహణాధికా రాజశేఖర్, వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్ కలిగిరి, డీసీపల్లి పొగాకు రైతులు, వ్యవసాయాధికారులు, పొగాకుబోర్డు సిబ్బంది పాల్గొన్నారు.





మనుబోలు : సంగమేశ్వరాలయంలో శివలింగం ఆకృతిలో దీపాలు



సీతారామపురం: భైరవకోనలో స్నానమాచరిస్తున్న భక్తులు



నెల్లూరు : నగరంలోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో మహా రుద్ర హోమం

శివోహం!

● వైభవంగా ఆఖరి కార్తీక సోమవారం

కార్తీక మాసంలో చివరి సోమవార పూజలు వేడుకగా జరిగాయి. వందే శివంశంకరం.. హరశంకర శివశంభో అంటూ భక్తుల నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమోగిపోయాయి. తెల్లవారుజాము కడలి, నదులు, బావుల్లో భక్తులు చన్నీటి స్నానాలు చేశారు. ఆలయాల్లో శివనామస్మరణలు చేస్తూ పాలభిషేకాల్లో పాల్గొన్నారు. మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, కేదారేశ్వరనోములు నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజలలో నందీశ్వరుడికి, మహాశివుడికి పాలభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఆలయాలన్నీ కార్తీక దీపాలతో శోభిల్లాయి. సాయంత్రం ప్రాకార ఉత్సవాలు, కార్తీక వనభోజన సమారాధనలు నిర్వహించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

25లోగా స్మార్ట్ రైస్ కార్డులు తీసుకోండి

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రైస్ కార్డులను ఈనెల 25వ తేదీలోగా తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బి. లీలారాణి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాకు 7,10,998 స్మార్ట్ కార్డులు రాగా, వాటిలో 6,35,716 కార్డులను లబ్ధిదారులు తీసుకున్నారని తెలిపారు. ఇంకా 75,282 కార్డులు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్డులు తీసుకోని వారు ఈనెల 25వ తేదీలోగా రేషన్ డీలర్ వద్ద, సచివాలయంలో సంప్రదించి తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో 20,17,681 యూనిట్ల ఈకేవైసీ చేయాల్సి ఉండగా, 19,41,252 యూనిట్లకు మాత్రమే ఈకేవైసీ చేశారన్నారు. 76429 యూనిట్లకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. కార్డుదారులంతా ఈనెల 25 లోగా రేషన్ డీలరును సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

పొట్టకూటి కోసం వెళుతూ..

● బొలెరో వాహనం బోల్తా : ఇద్దరి మృతి
● ఐదుగురికి తీవ్ర గాయాలు ● బాధితులంతా కూలీలే

వారంతా శ్రమ జీవులు. రెక్కాడితేగానీ డొక్కాడదు. ఉదయాన్నే అంతా కలిసి సెంట్రింగ్ సామగ్రితో బొలెరో వాహనంలో బయలుదేరారు. అల్లూరు మండలం సింగపేట వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కావలి మండలం బట్లదిన్నెకు చెందిన ఉప్పాల శీనయ్య (55), బండ్ల ప్రసాద్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. చేబ్రోలు హజరత్తయ్య, బండ్ల నాగరాజు, పెనుమల్లి వేణురెడ్డి, వల్లపల్లి తిరుపతిరావు, బండ్ల దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు 108 సాయంతో క్షతగాత్రులను నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

- పూర్తి వివరాలు 8లో..



ప్రైవేటు గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం

ఎరువుల దుకాణాల్లో
విస్తృత తనిఖీలు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వలు పెట్టి విక్రయిస్తున్న రూ.6.6 లక్షల డీఏపీ, ఇతర ఎరువుల అమ్మకాలు నిలిపి వేస్తూ మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం నోటీసులు జారీచేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత ధరకు మించి ఎరువులను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలం లోని ఆర్‌ఎస్‌కేలలో 120 టన్నుల యూరియా ఉందని, వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తిచేశారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం : సోమశిల జలాశయానికి సోమవారం 6,596 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 150, పవర్ టెన్నల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 73.600 టీఎంసీలు నిల్వ ఉంది.

ఇంకెన్నాళ్లు!

● నాలుగేళ్లయినా పూర్తికాని పెన్నా రక్షణ గోడల నిర్మాణం
● వరదలొస్తున్నాయంటే ఆ కాలనీల్లో భయం భయం
● మంత్రి దృష్టి పెడితేనే ప్రయోజనం
● అదనపు ప్రతిపాదనలపై సీఈల పరిశీలన

ఒక అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్నట్లు మారాయి పెన్నా రక్షణ గోడల నిర్మాణ పనులు. రెండేళ్లలోపు పూర్తి కావాల్సిన నిర్మాణం, నాలుగేళ్లయినా ఇంకా సాగుతూనే ఉంది. గత ప్రభుత్వంలో సగం పనులు జరగ్గా, బిల్లులు రాక కొంతకాలం పనులు నిలిచాయి. ఎన్నికల తర్వాత కొంతమేర పనులు జరిగినా గడిచిన ఏడాది నుంచి నెమ్మదించాయి. బిల్లుల సమస్య లేకపోయినా పనుల్లో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. 2020, 2021 వరదల నాటి పరిస్థితులను తలచుకొని నెల్లూరు సిటీలోని వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ, జనార్ధన్‌రెడ్డి కాలనీ ప్రజలు ఇప్పటికీ భయపడుతుంటారు. మొదట రూ.94 కోట్లతో నిర్మాణ పనులు మొదలుపెట్టగా, ఇప్పుడు పూర్తిస్థాయిలో కాంక్రీట్ వాల్ నిర్మించేందుకు మరో రూ.197 కోట్లు అవసరమవుతుందని అధికారులు నిర్ధారించారు. దీంతో పెన్నా రక్షణ గోడ నిర్మాణ పనులపై కొంత సందిగ్ధత నెలకొంది.



అర్ధంతరంగా ఆగిపోయిన పెన్నా రక్షణ గోడ నిర్మాణం

నెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెన్నా రక్షణ గోడల నిర్మాణం వర్కుకు మొదట తెలుగుగంగ ప్రాజెక్ట్ అధికారులు టెండర్లు పిలిచారు. ఆ తర్వాత రెగ్యులర్ ఇరిగేషన్‌కు మార్చారు. ఎర్త్ బండ్ నుంచి కాంక్రీట్ వాల్స్‌కు ఎస్టిమేషన్లు రివైజ్ చేశాక అప్పటికి మంజూరైన నిధులు రెండు కిలోమీటర్లకు బదులు 630 మీటర్లకు సరిపోయాయి. అగ్రిమెంట్ ప్రకారం రెండేళ్లలోపు పూర్తి చేయాల్సి ఉన్నా నాలుగేళ్లు గడిచినా 60 శాతం కూడా పూర్తి కాలేదు. అయితే పెన్నా రక్షణ గోడను 630 మీటర్ల దూరం మాత్రమే నిర్మించి వదిలేస్తే ప్రయోజనం ఉండదు. ముంపు బారి నుంచి కాపాడాలన్న లక్ష్యం నెరవేరదు. కొత్త రైల్వే బ్రిడ్జి నుంచి జాతీయ రహదారి బ్రిడ్జి వరకూ రెండు కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. దీంతో ఇప్పుడు నిర్మాణం జరుగుతున్న 630 మీటర్లు పోగా మిగిలిన 1.42 కిలోమీటర్లు కూడా ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలి. ఈ నేపథ్యంలో గతేడాది ఇరిగేషన్ అధికారులు ఈ మిగిలిన దూరానికి ఎస్టిమేషన్లు తయారు చేశారు. కాంక్రీట్ వాల్ నిర్మించాలంటే మరో రూ.197.31 కోట్లు అవసరమవుతుందని తేల్చారు. ఈ ప్రతిపాదనలను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపారు. గత వారంలో ఇద్దరు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు నెల్లూరుకు వచ్చి ఈ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్లారు. అయితే ఇంత భారీ మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పుడు మంజూరు చేసే పరిస్థితి ఉందా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

● **మంత్రి దృష్టి పెడితేనే..!**

వెంకటేశ్వరపురం, భగత్‌సింగ్ కాలనీ, జనార్ధన్‌రెడ్డి కాలనీలోని వేలాది కుటుంబాల రక్షణకు పెన్నా ప్రొటెక్షన్ వాల్ చాలా ముఖ్యమైనది. గతంలో పెన్నాకు భారీ వరదలు సంభవించినప్పుడు ఇక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. మరోసారి అటువంటి దుర్భర పరిస్థితులు పునరావృతం కాకూడదంటే త్వరగా ప్రొటెక్షన్ వాల్స్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇటీవల పెన్నాకు ఓ మోస్తరు వరద వచ్చినా కొంతమేర గోడ నిర్మాణం జరిగి ఉండడంతో నీరు ఇళ్ల వైపు వెళ్లలేదు. అయితే గడిచిన ఏడాదిగా ఈ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈ పనులపై మంత్రి పొంగూరు నారాయణ దృష్టి పెడితేనే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తిస్తున్న వైద్యాధికారులు

కుష్ఠు వ్యాధి
నివారణే లక్ష్యం

నెల్లూరు (వైద్యం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణే తమ లక్ష్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత వెల్లడించారు. కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు ప్రక్రియ జిల్లావ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. నగరంలోని ఎస్టీటీ కాలనీ, జేవీఆర్ కాలనీ, వైఎస్సార్ నగర్, చంద్రమౌళినగర్‌లలో వైద్యబృందం పర్యటించి కుష్ఠువ్యాధి అనుమానితుల నుంచి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి గ్రస్థుల గుర్తింపే లక్ష్యంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని ఆదేశించారు. ఎర్రటి మచ్చలు ఉన్నవారిని గుర్తించి వారి నమూనాలు సేకరించాలన్నారు. కొత్తగా అనుమానిత కేసులను వైద్యాధికారులకు తెలియచేయాలని తద్వారా వారికి వైద్యచికిత్సలు అందిస్తారని వెల్లడించారు. అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 3,789 బృందాలు ఇంటింటికి తిరిగి కుష్ఠు వ్యాధిగ్రస్థులను గుర్తిస్తారని, 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌టీ కో ఆర్డినేటర్ సురేష్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

అందరి 'సహకార'ంతో **లాభాల బాట** ◆ అర్జీలను పారదర్శకంగా **విచారించాలి** ◆ జిల్లాలో రూ.6,815 కోట్ల పెట్టుబడులు **4800 మందికి ఉపాధి** ◆ ఆ రెండు గ్రామాల్లో **వైద్యబృందం సర్వే** ◆ కబ్జా కోరల్లో **ప్రభుత్వ భూమి**
వివరాలు 8వ పేజీలో..







అష్టదిగ్బంధం!

● ఆత్మకూరు ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జి మూత
● మరమ్మతుల పేరుతో అధికారుల నిర్ణయం
● ఎక్కడికక్కడ ఆగిపోయిన వాహనాలు
● తొలిరోజే నరకం చూసిన నగరవాసులు

నెల్లూరు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మరమ్మతుల పేరుతో నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ బ్రిడ్జి, బోసుబొమ్మ వైపు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జీలను సోమవారం నుంచి పూర్తిగా మూసివేశారు. సుమారు 45 రోజులపాటు వీటిని తెరవరు. దీంతో ఒక్కసారిగా వేలాది వాహనాల రాకపోకలతో ఆత్మకూరు బస్టాండు కూడలి అష్టదిగ్బంధంగా మారింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపై ఆగిపోవడంతో ప్రజలు నరకం అనుభవించారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, దినసరి కూలీలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

● ఆత్మకూరు బస్టాండు వద్ద సోమవారం ఉదయం నుంచే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

వెంకటేశ్వరపురం, మినీ బైపాస్ నుంచి వచ్చే బస్సులు, ట్రాక్టర్లు, వ్యాన్‌లు, ఆటోలు, బైక్‌లు ఫ్లైఓవర్ మూసివేయడంతో కిందనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో బస్టాండు వద్ద ఉన్న కోవూరు, బుచ్చి వైపు వెళ్లే ఆటోలు, ప్రైవేటు బస్సులు సగం రోడ్డును ఆక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్టోన్‌హౌస్‌పేట బ్రిడ్జి దాటిన తర్వాత ఆటోస్టాండ్‌లతో ట్రాఫిక్ అంతరాయం, శెట్టిగుంట రోడ్డుకు అటు ఇటు దుకాణదారులు ఆక్రమించడంతో ట్రాఫిక్ మరింత జటిలమైంది. ఇక వంతెనకు వేస్తున్న పెయింట్ పనులతో సగం రోడ్డు స్టాండులతో నిండిపోయింది. ఇలా చెప్పుకుంటూపోతే ఆత్మకూరు బస్టాండు కూడలి ఒక్కరోజులో నగరవాసులకు నరకం చూపించింది.

● మరోవైపు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో రంగనాయకులపేట గేటు వైపు నుంచి నగరంలోకి ప్రజలు వెళుతున్నారు. దీంతో వేలాది వాహనాలు రైల్వే గేటు మార్గం వైపు తిరుగుతున్నాయి. అయితే గేటు వేస్తే వాహనాలు బారులు తీరుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు, రైల్వే అండర్ బ్రిడ్జిని ఒకేసారి మూయడంతో ప్రజల్లో అసహనం నెలకొంది. ఒక పని తర్వాత ఒక పని మొదలు పెట్టి ఉంటే ఇబ్బందులు ఉండేవి కావని అభిప్రాయపడుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 635

నిత్యావసర సరుకుల పంపిణీ

అల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పడమర గోగులపల్లి చింతచెట్టు కాలనీలో గిరిజనులకు సోమవారం ఏఆర్‌డీ సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకులను సర్పంచి ఆట తిరుమల పంపిణీ చేశారు. గిరిజనులకు ఏఆర్‌డీ సంస్థ చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోట శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సర్పంచి తిరుమల

సమస్యలను సకాలంలో

పరిష్కరించాలి : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ పీ చంద్రబాబునాయుడు, సర్పంచి మాచర్ల, అధికారులతో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ సురేష్ బాబుకు సూచించారు. పింఛన్ సమస్యలను సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాలకు వెళ్లి పరిష్కరించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు రూ. 5 కోట్లకుపైగా నిధులు వెచ్చించి సీసీ రోడ్లు వేయించామని, త్వరలో మరో రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 60 అర్జీలు వచ్చాయని, వీటిని ఆన్‌లైన్లో నమోదుచేసి సత్వరమే పరిష్కరించేలా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. స్థానిక పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పోలినేని రమేష్ కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● టీడీపీలో చేరిక

స్థానిక బీసీ కాలనీలో యాదవ సామాజిక వర్గానికి చెందిన సుమారు 100 మంది వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే సురేష్ సమక్షంలో కన్వీనర్ చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా లక్ష్మీనరసింహులు, దామా మహేశ్వరరావు, దాసరి అశోక్, బద్దిపూడి మాచర్ల, బీ హరిబాబు, కుంకు మోహనరావు, అల్లిక మధు, తాటికొండ అనూష, చిమ్మిలి శ్రీదేవి, చిమ్మిలి రాంబాబు, దొడ్ల తిరుపతినాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను తొలగించడం అన్యాయం

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ స్వరాజ్ మైదానంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పారిశుధ్య నిర్వహణకు కాంట్రాక్ట్ పద్ధతిలో గత ప్రభుత్వం నియమించిన 19 మంది కార్మికులను తొలగిండం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్మికులను తొలగించటం వల్ల అంబేద్కర్ విగ్రహ నిర్వహణను గాలికి వదిలేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతి, ఎమ్మార్పీఎస్ నాయకులు జరుగుమలి విజయరత్నం, నరసింహారావు, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, సేననేత మస్తానయ్య పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘం నేతలు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కావలి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొత్తపల్లి శ్రీ వేదం విద్యాలయం కరస్పాండెంట్ పంగుళూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో చాంపియన్లుగా నిలిచిన 9వ తరగతి విద్యార్థులు ఆర్ చరణ్, ఏ చరణ్‌లను అభినందించారు. అన్ని విభాగాల్లో కలిపి 13 ప్రథమ బహుమతులు, 6 ద్వితీయ బహుమతులు, ఒక తృతీయ బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాధించిన బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు శోచనీయం

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, క్రిమీలేయర్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు శోచనీయమని అఖిలభారత మాలసంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అమరావతిలో న్యాయవాదుల సదస్సులో పాల్గొన్న జస్టిస్ గవాయ్ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ ఉండాల్సిందేనని వ్యాఖ్యానించటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకమని పేర్కొన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికే చెందిన గవాయ్ పూర్తిగా అమలుపరచని రిజర్వేషన్ల గురించి కానీ, జనాభా ప్రాతిపదికన పెంచాల్సిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల గురించి కానీ, ఇప్పటివరకు ప్రాతినిధ్యంలేని శాస్త్ర, సాంకేతిక రంగాల్లోని రిజర్వేషన్ల గురించి కానీ, ప్రైవేటురంగంలో పూర్తిగా ఎత్తివేస్తున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల గురించి కానీ కనీసం ప్రస్తావించకుండా క్రిమీలేయర్ గురించి మాత్రమే మాట్లాడటం శోచనీయమని పేర్కొన్నారు.

పర్యావరణ అనుమతులు ఇవ్వడం దారుణం

కందుకూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వాస్తవ పరిస్థితులు చూడకుండా బీపీసీఎల్ ప్రాజెక్టు ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు ఇవ్వడం దారుణమని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అత్యధిక వాయుకాలుష్యం ఉండే బీపీసీఎల్ ప్రభావం చుట్టూ 20 కి.మీటర్ల వరకు తీవ్రంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ కనిపించటం లేదన్నారు. అంతేగాక పర్యావరణ నివేదికలో వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాల వారు ఎవరూ ఉపాధి కోల్పోవడం లేదని పేర్కొనటం సిగ్గుచేటన్నారు. భూసేకరణ వలన ఉపాధి కోల్పోయే కుటుంబాల పూర్తిజాబితా విడుదల చేయాలని, వారు కోల్పోయే జీవితకాలం ఆదాయం ఆధారంగా న్యాయమైన పరిహారం ఇవ్వటంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధికి ప్రభుత్వం హామీ ఇవ్వాలని నేతి మహేశ్వరరావు డిమాండ్ చేశారు.

చెట్ల కొమ్మల నరికివేత అడ్డగింత

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో ఉన్న వేపచెట్ల కొమ్మలను నరుకుతుండగా సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే దివి శివరాం అడ్డుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని గదుల నిర్మాణానికి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తుండగా ఎవరి అనుమతితో కొడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేస్తూ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

రన్నింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఐఆర్‌ఎఫ్ పిలుపు మేరకు బిట్రగుంట రైల్వే క్రూబుకింగ్ లాబీ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ చైర్మన్ ఎంవీ శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెరిగిన డీఏకు అనుగుణంగా మైలేజ్ అలవెన్స్ పెంచాలన్నారు. పెండింగ్ డీఏ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వీఎస్ బాబు, ఆర్వీ నరసయ్య, డీ నవీన్, శ్రీహరి, విజయ్, రాజీవ్, మరియబాబు తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మజ్దూర్ యూనియన్ సభ్యులు

నేడు కావలి మండల సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావే శం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నిర్మూలన, ఉపాధిహామీ పనులు తదితర అంశాలపై ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యుడితోపాటు సర్పంచిలు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

అలంకారప్రాయంగా ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్

ఏరియా వైద్యశాలలో నాలుగు నెలలుగా తాగునీటి అవస్థలు

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా వైద్యశాలలో ప్యూరిఫైడ్ వాటర్ యూనిట్ మోటారు, కాపర్ వైర్లు నాలుగు నెలల కిందట చోరీకి గురయ్యాయి. అప్పటి నుంచి రోగులు, వారి సహాయకులు తాగు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఓపీ హాలు వద్ద తాత్కాలికంగా వాటర్ క్యాన్ల ద్వారా కొంత మేర మంచినీరు అందిస్తున్నా ఓపీ సమయం దాటిన తర్వాత తాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. కాగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు బీఎంఆర్ ట్రస్టు నిధులతో ఆస్పత్రిలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. అయితే కాపర్ వైర్లను దొంగలు తీసుకెళ్లినప్పటి నుండి వాటర్ ప్లాంటు పని చేయడం లేదు. మరమ్మతుల విషయంలో వైద్యాధికారులు తగిన శ్రద్ధ చూపక పోవటంతో తాగునీటి కోసం రోగులు, వారి సహాయకులకు తిప్పలు తప్పటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాలలో తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

ప్రభుత్వ వైద్యశాలలో వాటర్ ప్యూరిఫైడ్ యూనిట్ మోటారు, ఏసీల కాపర్‌వైర్లు చోరీ అయ్యాయని ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా పోలీసులు, వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు. ఇప్పటికైనా కొత్తవి అమర్చాలన్నారు.



ఖాళీ బాటిల్‌తో వెనుదిరిగి వస్తున్న రోగి సహాయకుడు

లక్ష్యసాధనకు క్రీడలు దోహదపడతాయి

● వీఎస్‌యూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ● కావలి జేబీలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

కావలి (టౌన్) నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనకు క్రీడలు దోహదపడతాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డాక్టర్ డీఆర్ క్రీడా ప్రాంగణంలో సోమవారం వీఎస్‌యు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ సభకు జేబీ కరస్పాండెంట్ వేణుంబాక సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ కె సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకట్రాయలు పాల్గొన్నారు. వీసీ, రిజిస్ట్రార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఉపకులపతి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, నిబంధనలతో సంబంధం లేకుండా ప్రభుత్వం వారిని ఉన్నత పదవు ల్లో నియమించి, సత్కరిస్తుందన్నారు. రిజిస్ట్రార్ కె సునీత మాట్లాడుతూ క్రీడాకారులకు వీఎస్‌యు మంచి అవకాశాలు కల్పిస్తోందని, ప్రతి ఏటా క్రీడాకారుల సంఖ్య పెరగాలని కోరారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పురుషుల వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్, టీటీ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, దాదాపు 18 కళాశాలల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్సిటీ జట్లకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, అబ్జర్వర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

రెడ్‌క్రాస్‌కు రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటసాయి సత్య శ్రీరాజ్

కావలి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ కేంద్రం నిర్మాణానికి కావలి ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గాదంశెట్టి మధుసూధనరావు లక్ష రూపాయలు విరాళాన్ని తన కుమారుడు వెంకటసాయి సత్య శ్రీరాజ్ జన్మదినం సందర్భంగా అందజేశారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పాలకమండలి సభ్యుల సమక్షంలో రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావుకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటసాయి సత్యశ్రీరాజ్, చరిత దంపతులను రెడ్‌క్రాస్ బాధ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, రెడ్‌క్రాస్ బాధ్యులు కే. హరినారపరెడ్డి, ఏ రమేష్‌రెడ్డి, నల్లూరు రవికుమార్, వెంకటసుబ్బయ్య, కలికి శ్రీహరిరెడ్డి సురేష్ రెడ్డి, ఆర్యవైశ్యసంఘం డైరెక్టర్ తటవర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో లక్ష దీపోత్సవం

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపోత్సవాలు నిర్వహించారు. పెద్దబజారులో ఉన్న కోదండ రామాలయంలో లక్షదీపోత్సవం, రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో ప్రత్యేకంగా శివలింగాన్ని ఏర్పాటుచేసి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలోను కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు శివలింగం, ఢమరుకం, త్రిశూలం ఆకారాలలో దీపాలను వెలిగించి శివలింగాన్ని పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు.



రుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరైన భక్తులు

గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ దాడులు

● 38 మందిపై కేసుల నమోదు ● రూ.5.43 లక్షల అపరాధ రుసుం విధింపు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో విద్యుత్‌శాఖ 32 బృందాలతో సోమవారం విస్తృత దాడులు నిర్వహించి 38 మందిపై కేసులు నమోదు చేసింది. ఒంగోలు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డీపీఈ హైమావతి, కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరయ్యలు తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న 38 మందిపై వివిధ కేసులు నమోదు చేసి రూ.5,43,000 అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు. మీటరు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మందిపై రూ.40,000, అనుమతి కన్నా అధిక కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న వ్యక్తిపై రూ.5000, అనుమతికి మించి అదనంగా విద్యుత్ వాడుతున్న 26 మందికి రూ.4,98,000 అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ విద్యుత్ వాడకానికి సంబంధించి ఫిర్యాదు చేయదలచినవారు 9440812358, 9440812359 నెంబర్లకు వాట్సప్ ద్వారా సమాచారం తెలియచేయాలన్నారు. విజిలెన్స్ దాడులు నిర్వహించిన వారిలో సింగరాయకొండ డీఈఈ యుగంధర్, ఉలవపాడు ఏఈ పీ సాయిబాబు, లైన్‌మెన్‌లు సత్యనారాయణ, మీరావలి, కందుకూరు, సింగరాయకొండ సబ్ డివిజన్‌కు చెందిన ఏడీఈ, ఏఈలు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.



విజిలెన్స్ దాడుల వివరాలు తెలుపుతున్న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు

ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తా!

● అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాను ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని సండేమార్కెట్, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అండర్ బ్రిడ్జి వద్ద రూ.1.02 కోట్లతో రోడ్డు ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. వర్షాలు వస్తే సండేమార్కెట్లో నీరు నిలిచి సమస్యలు వస్తున్నందున అక్కడ కూడా శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేతలు తాళ్లపాక అనురాధ, మధు, సుజనాకుమార్ పాల్గొన్నారు.

● 15 హైస్కూళ్లను అభివృద్ధి చేస్తాం

నెల్లూరు(విద్య): నెల్లూరులో వీఆర్ హైస్కూల్ తరహాలోనే మరో 15 మున్సిపల్ హైస్కూళ్లను అభివృద్ధి చేస్తామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నగరంలోని కర్నాలమిట్ట మున్సిపల్ హైస్కూల్, బీవీఎస్ హైస్కూల్, చిన్నబాలయ్య హైస్కూల్, వైవీఎం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఎన్నికల హామీ మేరకు మరో 15 హైస్కూళ్లను బాగు చేస్తామని చెప్పారు.

రైతులను తప్పుదారి పట్టిస్తున్న వైసీపీ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక, వైసీపీ నాయకులు రైతులను తప్పుదారి పట్టిస్తోందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు విమర్శించారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా అంతంతమాత్రంగా అందజేస్తున్నారంటూ వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. నాగులవరం పంచాయతీలో 18 మెట్రిక్ టన్నుల యూరియా ప్రస్తుతానికి అందుబాటులో ఉందని మాలేపాటి అన్నారు. రైతుల అవసరాన్ని బట్టి మండలంలో 360 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఈ నెల మొదటి వారం నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. వైసీపీ నాయకుడు మూడుచోట్ల పొలాలకు 120 బస్తాల యూరియా తీసుకున్న సంగతి మరిచినట్లున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, కావలి ఏఎంసీ డైరెక్టర్లు గణేషం రమేష్‌రెడ్డి, లేల్లపల్లి సుధీర్‌బాబు, టీడీపీ రైతు సంఘం నాయకులు కోట్టా వెంకారెడ్డి, వై. వెంకటేశ్వర్లు, పుట్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు మూడు బస్తాల ఎరువులు

బిట్రగుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రైతు పక్షపాతి అని, వారి అవసరాలు తెలుసుకుని పార్టీలకు అతీతంగా యూరియ అందజేస్తున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. బోగోలు మండలంలోని పలుచోట్ల సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులు ఎకరాకు మూడు బస్తాల చొప్పున దశలవారీగా యూరియాను పొందవచ్చన్నారు. బోగోలు- 1, బోగోలు -3 సచివాలయాల పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గనిపినేని నాగరాజు, పోతల శ్రీనయ్య, ఏఏవో హరిణి, రైతులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి

రేపు లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే. శ్రీనివాసులు సోమవారం ఒక పక్రట నలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్సు రద్దు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ డివిజన్ పరిధిలో ప్రైవేటు వ్యాపారులు ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన యూరియా కొరత వెంటాడుతోంది కథనానికి ఆయన స్పందించారు. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి రైతు సేవాకేంద్రాల ద్వారా యూరియా, ఇతర ఎరువులు ఇండెంట్లపై తెప్పించి రైతులకు ఎంఆర్‌పీకే అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఇండెంట్లు పెట్టి ఆర్‌ఎస్‌కేల ద్వారా ఎరువులు తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), (ఆంధ్రజ్యోతి) : తిరుపతి బార్ అసోసియేషన్ మెంబర్ ఏ.రాజశేఖర్‌రెడ్డిపై పుత్తూరు కోర్టులో ప్రతివాది హత్యాయత్నానికి ప్రయత్నించడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలియచేయనున్నారు.

చెక్కు చెదరని నిర్మాణాలు... చరిత్రకు ఆనవాళ్లు!

స్వాతంత్ర్యానికి ముందు కోవూరు నియోజకవర్గ పరిధిలో నిర్మించిన వంతెనలు, తూములు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. బ్రిటీషు కాలంలో కనిగిరి రిజర్వాయర్ నుం చి వచ్చే పంటకాలువ (సదరన్ చానల్ డిస్ట్రిబ్యూటరీ చానల్) పై నిర్మించిన వారధి ఇప్పటికీ అలానే ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న వంతెనలు ఐదేళ్లకే మరమ్మతుల కు గురవుతున్నాయి. కోవూరు - నెల్లూరు మార్గంలో స్టౌబీడీ కాలనీ సమీపంలో నిర్మించిన ఈ వంతెన నేటికీ సేవలందిస్తోంది. అయితే ఇటీవల వంతెన తూ ములకు వేసిన తెల్లసున్నం ఊడిపోయింది. ఈ క్రమంలో నీటిపారుదల శాఖాధికారులు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా ఇదేమార్గంలో పీటర్స్ కాలువపై నిర్మించిన వంతెన, భూమట్టంతో కలిసి పోవడంతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవతో పునర్నిర్మిస్తున్నారు.

-కోవూరు, (ఆంధ్రజ్యోతి)



గ్రంథాలయ వారోత్సవాల్లో
నాణేలు, నోట్ల ప్రదర్శన

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేం ద్ర గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనం, నోట్లు, నాణేల ప్రదర్శన నిర్వహించా రు. కవి సమ్మేళనంలో చిన్నినారాయణరావు, ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధర్‌బాబు, సతీష్‌కుమార్ తదితర కవులు విచ్చేసి వారి కవితలు వినిపించారు. ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కరెన్సీ నోట్లు, నాణేల ప్రదర్శన నిర్వహించారు. పాఠకులను ఇవి ఎంతో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర పౌరగ్రంథాల య సంచాలకులు కృష్ణమోహన్ కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులను కప్పి సత్కరించా రు. పుస్తకాన్ని బహుమతిగా అందచేశారు. నోట్లు, నాణెల ప్రదర్శనను తిలకించి సతీష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు, గ్రంథాలయాల సిబ్బంది, విద్యార్థులు, తదితరలు పాల్గొన్నారు.

-నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



అందరి సహకారంతో లాభాల బాట

● సహకార వారోత్సవ సభలో చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి



మాట్లాడుతున్న చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు, పాలక మండలి సహకారంతో తమ బ్యాంకు 109 ఏళ్ల పూర్తి చేసుకుని 110వ సంవత్సరంలోకి అడుగు పెట్టి లాభాల బాటలో సాగుతోందని నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. సోమవారం అర్బన్ బ్యాంకులో జరిగిన సహకార వారోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు లాభాల బాటలో పయనించడం వలన షేర్ హోల్డర్‌లకు 12 శాతం డివిడెండ్ అందచేశామన్నారు. జాతీయ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తూ, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 2024-25లో రూ.80 లక్షల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. 2017లో చైర్మన్‌గా తాను బాధ్యతలు స్వీకరించక ముందు తమ బ్యాంకు ఎన్‌పీఏ 20 శాతానికి పైబడి ఉండేదన్నారు. దీనిని 4 శాతానికి తగ్గించి ఆర్బీఐ మెప్పు పొందామని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. నెల్లూరు డివిజన్ కోఆపరేటివ్ అధికారి కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహకార రంగంలో బ్యాంకులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లాభాల బాటలో నడవటమే కాక, డివిడెండ్ చెల్లించే స్థాయికి ఎదగటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పురిటిబిడ్డకు
చన్నీటి స్నానమా..!?

- జీజీహెచ్ ప్రసూతి విభాగంలో మూలనపడ్డ సోలార్ హీటర్లు
- మూడేళ్లుగా ఇదే పరిస్థితి
- వేడినీళ్లు బయట కొనుగోలు చేస్తున్న బాలింతలు
- త్వరలో అందుబాటులోకి... : సూపరింటెండెంట్ వెల్లడి

నెల్లూరు (వైద్యం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణులు, బాలింతలు గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. ఇందువల్ల బ్యాక్టీరియా నశించి ఆరోగ్యాన్ని సమకూరుతుంది. అలాగే పుట్టినబిడ్డను తప్పనిసరిగా గోరువెచ్చని నీటితో తుడవాలి. తద్వారా తల్లికడుపులో ఉన్న మలినాలు, ఇతర వ్యర్థాలు బిడ్డకు అంటుకోవు. ఇందుకు వేడినీరు అవసరం. అయితే నగరంలోని జీజీహెచ్ ప్రసూతి విభాగంలో ప్రస్తుతం వేడినీరు అందుబాటులో లేదు. ఈ స్థితిలో గర్భిణలు, బాలింతలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం.

● పనిచేయని హీటర్లు

మూడేళ్లుగా ఇక్కడ ఉన్న 12 సోలార్ హీటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వేడినీటికి నానా కష్టాలు పడుతున్నారు. ఆసుపత్రిలో వేడినీరు అందుబాటులో లేక పోవటంతో బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతల పై ఆర్థిక భారం పడుతుంది. సోలార్ హీటర్లు మరమ్మతులు చేయాలని జీజీహెచ్ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పురిటిబిడ్డకి వేడినీరు అవసరమని పదేపదే వైద్యులు చెబుతున్నా, వారి గోడు పట్టించుకునేవారు లేరు. రూ. 10వేల నుంచి రూ. 20 వేలు ఖర్చు చేస్తే సోలార్ హీటర్లు అందుబాటులోకి వస్తాయని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. వాటిని పరిశీలించి ఇన్ని రోజులు ఎందుకు మరమ్మతు చేయలేదని వైద్యసిబ్బందిని పలువురు ప్రశ్నించారు. సోలారు హీటర్లను అందుబాటులోకి తెచ్చేలా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కృషి చేయాల్సి ఉంది.



జీజీహెచ్‌లోని బాలింతలు, చిన్నపిల్లల వార్డు

త్వరలో అందుబాటులోకి తెస్తాం..

జీజీహెచ్‌లోని ప్రసూతి విభాగంలో వేడినీరు సరఫరా చేసే సోలార్ హీటర్లు మరమ్మతులకు గురైన విషయం నాకు తెలియదు. లేదంటే ఎప్పుడో అందుబాటులోకి తీసుకువచ్చేవాళ్లం. వెంటనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటా.

- డాక్టర్ మాధవి, జీజీహెచ్ సూపరింటెండెంట్





మరమ్మతులకు నోచని సోలార్ హీటర్లు

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

- రియల్టర్లకు కట్టబెడుతున్న రెవెన్యూ అధికారులు ?
- సర్కార్ ఆదాయానికి భారీగా గండి



ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి

తోటపల్లిగూడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కబ్జా కోరల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు, స్వయంగా వారే రియల్టర్లకు ప్రభు త్వ భూమిని కట్టపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే... తోటపల్లిగూడూరు మండలం ఈదూరు బిట్ వన్ మల్లికార్జునపురం గ్రామంలో సర్వే నెంబరు 42-1లో 3. 65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరా రూ.కోటి వరకు ఉంటుందని రైతులు తెలిపారు. ఆ భూమికి ఆనుకుని రియల్టర్లు భూమిని కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ఆ భూమిని ఆనుకుని ఉ న్న 3.65 ఎకరాల భూమిని తమ రియల్ ఎస్టేట్ భూముల్లో కలుపుకునేందుకు రెవెన్యూ అధికారులతో చేతు లు కలిపి ఆక్రమించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రభుత్వ భూమి అత్యంత విలువైనది. అందువల్లే ఆక్రమణలకు గురైందని స్థానికులు చెబుతున్నా రు. ఈ మేరకు ఇటీవల సర్వే చేసిన సర్వేయర్, తహసీల్దారు రికార్డును పరిశీలించి ప్రభుత్వ భూమి అని ని ర్ధారించారు. తొలుత ప్రభుత్వ భూమిగా నిర్ధారించి ఎ ప్పుడైతే ఆక్రమణదారుడు లోపాయికారి ఒప్పందం కు దుర్చుకున్నారో... ఆ భూమికి గతంలో పట్టా మంజూరైనట్లు చెబుతున్నారు. ఈ విషయంపై పలు అనుమానా లు వ్యక్తం అవుతున్నాయి. అధికారులకు భారీ ముడుపులు అందినట్లుగా అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి రూ.కోటి విలువ చేసే భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు వీ.సుధీర్‌ను వివరణ కోర గా ఆ భూమి ప్రభుత్వ భూమి అని, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామన్నారు. సమగ్రంగా సర్వే చేయించి హద్దు లు ఏర్పాటు చేస్తామన్నారు.

26 వరకు ఆధార్ శిబిరాలు

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పిల్లలకు 26వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శి బిరాలు నిర్వహించను న్నట్లు ఎంపీ డీవో చెంచమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అర్జీలను పారదర్శకంగా విచారించాలి : కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను పారదర్శకంగా విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. పరిష్కరించలేని ఫిర్యాదులను ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో, అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

● అందిన అర్జీలు 453

పీజీఆర్ఎస్‌కు 453 వినతులను అర్జీదారులు సమర్పించారు. వీటిలో రెవెన్యూశాఖకి 155 అర్జీలు, సర్వేశాఖవి 29 , పోలీసు శాఖవి 101, మిగిలిన అర్జీలు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. వాటిలో కొన్ని..

● ఖరీఫ్ కొనుగోళ్ల లక్ష్యాన్ని ముందుగా నిర్దేశించాలి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను ముందుగానే నిర్ణయించేలా ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ. సరేంద్రరెడ్డి కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం చేయటం కోసం ముందస్తుగానే నివేదిక పంపాలని కోరారు.

● శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

నెల్లూరు (వైద్యం) : నగర పరిధిలోని బుజబుజనెల్లూరులో శ్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని డ్వామా పీడీ గంగాభవానికి సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు మాలకొండయ్య, క్రిష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శివాజి, అంజనేయులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా : ఇద్దరి మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- సింగపేట వద్ద ఘటన
- బాధితులంతా భవన నిర్మాణ కార్మికులే..



బండ్ల ప్రసాద్ (ఫైల్)



ఉప్పాల శీనయ్య (ఫైల్)

అల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం బోల్తా పడగా, ఇద్దరు మృతిచెందారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లూరు మండలం సింగపేట సమీపంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కావలి మండలం బట్లదిన్నెకు చెందిన ఉప్పాల శీనయ్య (55), బండ్ల ప్రసాద్ (55)తోపాటు చేబ్రోలు హజరత్తయ్య, బండ్ల నాగరాజు, పెనుమల్లి వేణురెడ్డి, వల్లపల్లి తిరుపతిరావు, బండ్ల దిలీప్ కలసి అల్లూరు మండలం గోగులపల్లికి బొలెరో వాహనంలో సెంట్రింగ్ సామగ్రి వేసుకొని బయలుదేరారు. వాహనాన్ని బండ్ల దిలీప్ నడుపుతుండగా, అందరూ నిల్చొని ఉన్నారు. ఉదయం 7.00 గంటల సమయంలో వాహనం సింగపేట దాటాక ఇంజన్‌కు, టైర్లకు జాయింటుగా అమర్చబడి ఉండే యాక్సిల్ రాడ్డు ముందు భాగం ఊడి నేలకు గట్టిగా ఆనింది. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో శీనయ్య, ప్రసాద్ కిందపడి, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది క్షతగాత్రులను నెల్లూరులోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అల్లూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు : వీపీఆర్



విలేకరులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆం ధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షతతో సీఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. సోమవారం నగరంలోని తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా రాష్ట్రానికి రూ.13,25,716 ల క్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకోవటం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతరం జరిపిన సంప్రదింపులతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. ప్రభుత్వం తొలుత 8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తే అంతకుమించి రావటం గొప్ప విషయమని చెప్పారు. వీటి ద్వారా 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో 6,815 కోట్ల పెట్టుబడుల ద్వారా 4800 మందికి ఉద్యోగాలు రానున్నాయని వివరంచారు. జిల్లాలో జేఎం బాక్సీ గ్రూపు సంస్థ, ఇండోసోల్ కంపెనీ, ఐటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ, ఆర్‌సీఆర్‌టీలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కి 130 ఫిర్యాదులు



బాధితుల వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 130 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలపై ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్లు భక్తవత్సలరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై క్షేత్రస్థాయి సర్వే



సర్వేలో వివరాలు సేకరిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి బృందం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరురూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులతో జబ్బున పడ్డ నెల్లూరు రూరల్లోని కొమ్మరపూడి, కొత్తవెల్లంటి గ్రామాల్లో వైద్య బృందం క్షేత్రస్థాయిలో క్లలో సర్వే చేపట్టారు. ఈ రెండు గ్రామాల్లో కి డ్నీ వ్యాధులు సోకి మరణాలు సంభవిస్తున్నాయని ఈనెల 10 న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీ సుకువచ్చిన పరిశోధనాత్మక కథనంతో జిల్లా యంత్రాంగం కదిలింది. ఇప్పటికే గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఈ రెండు గ్రామాల్లో నీటి నమూనాలను సేకరించి పరిశోధనకు పంపారు. కాగా వ్యాధుల వ్యాప్తిపై సౌత్‌మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రవీంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో వైద్య బృందం సోమవారం గ్రామాల్లో సర్వే నిర్వహించారు. వ్యాధిగ్రస్థుల ఇళ్లకు వెళ్లి రికార్డులు పరిశీలించి బాధితులతో మాట్లాడారు. వ్యాధి మూలాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నామని, గ్రా మాల్లో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యం బృందం పేర్కొన్నారు.

మితిమీరిన వేగం.. పోయింది ప్రాణం!

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మనుబోలు, నవం బరు 17 (ఆంధ్ర జ్యోతి): చేతిలో హెవీ సీసీ బైక్...అందులో హైవే. పైగా మెకానిక్. ఇంకేముంది... మితి మీరిన వేగంతో దూసు కెళ్లాడు. నెల్లూరు నుం చి మనుబోలు వరకు క్షేమంగానే వెళ్లిన ఆ యువకుడు వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో వేగాన్ని అదుపు చేయలేకపోయాడు. మోటార్ సైకిల్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎస్కే సుహెల్ (20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. నెల్లూరు ప్రగతి నగర్‌లోని పొదల కూరు రోడ్డు సెంటర్‌కు చెందిన రహంతుల్లా, షమ్మాలకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రహంతుల్లా ఎంబ్రాయిడింగ్ పనిచేస్తుంటాడు. కుమారుడు సుహెల్ ఏడాదిన్నరగా ట్రయాంప్ అనే మోటార్‌సైకిల్ కంపెనీలో మెకానిక్ (హెల్పర్)గా పని చేస్తున్నాడు. సోమవారం సుహెల్ విధులకు హాజరు కాకుండా, పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై గూడూరుకు బయలుదేరాడు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఎగిరి అవతలి రోడ్డుపై పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో అవతలి రోడ్డుపై వెళుతున్న కంటైనర్ వెనుక భాగాన సుహెల్ పడడంతో తల పగిలి దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరాకేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. సుహెల్ హెల్మెట్ ధరించి ఉండి ఉంటే ప్రాణాలు దక్కేవని స్థానికులు చెబుతున్నారు.

అన్న హత్య కేసులో తమ్ముడికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఆస్తి కోసం సొంత అన్నను తల మీద కొట్టి కిరాతకంగా హత్య చేసి ఇంటిని తగలబెట్టిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పాముల శీనయ్యకు జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 3వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయా ధికారి ఎల్ తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముత్తుకూరు మండలం రొయ్యలపాళెంకు చెందిన పాముల శీనయ్య, పాముల సుబ్రహ్మణ్యం అన్నదమ్ములు. వీరికి ఆస్తి విషయంలో వివాదం ఉంది. ఈక్రమంలో 2022 మే 7వ తేదీన ఉదయం రొయ్యలపాళెంలోనే ఇనుపరాడ్‌కు గుడ్డ చుట్టి అన్న సుబ్రహ్మణ్యంను తమ్ముడు శీనయ్య వెనుక నుంచి తలపై బలంగా కొట్టాడు. ఆ తరువాత ఇంటికి కూడా నిప్పు పెట్టాడు. గాయపడిన సుబ్రహ్మణ్యంను చికిత్స నిమిత్తం బంధువులు తొలుత నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నారా యణ అసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ముత్తుకూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి పై విధంగా జైలు శిక్షతోపాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం చెంచుకృష్ణ వాదించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు కోటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులతో పాటు గ్రామస్థులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీహెచ్‌ఏకు తీవ్ర గాయాలు

ఉదయగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపాన 167-బీజీ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. వింజమూరు మండలం కాటేపల్లికి చెందిన ఓంకారం వెంకటభరత్ సీతారామపురం మండలం అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో హాజరయ్యేందుకు స్వగ్రామం నుంచి మోటార్‌బైక్‌పై బయలుదేరిన వెంకటభరత్ దాసరిపల్లి గ్రామ సమీపానికి రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై ఉన్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అతన్ని నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు.